పోరు.. ఖరారు...



ముగిసిన నామినేషన్ల ఘట్టం

పుట్టపర్తి, ఏప్రిల్ 29: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోరులో నిలిచేదెవరో ఖరారైంది. పోటీలో నిలిచేదెవరో తేలిపోయింది. నామినేషన్ల పర్వం సోమవారం ముగిసింది. పలువురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. హిందూపురం పార్లమెంటు స్థానంలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా.. బరిలో 13 మంది నిలిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు పేర్కొన్నారు. వీరిలో ఉమ్మడి టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, వైసీపీ తరపున శాంత, కాంగ్రెస్ అభ్యర్థిగా సమద్ షాహీన్, బీఎస్పీ ఆర్ఎస్ భాగ్య, మరో మూడు పార్టీల అభ్యర్థులతోపాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో మిగిలారు. ఆరు ఎమ్మెల్యే స్థానాల బరిలో 78 మంది నిలిచారు. వీరిలో 42 మంది స్వతంత్ర అభ్యర్థులున్నారు. ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లో అత్యధికంగా 15 మంది బరిలో ఉండగా, హిందూపురం, మడకశిర, కదిరి, హిందూపురం పార్లమెంటు స్థానానికి 13 మంది చొప్పున పోటీలో నిలిచారు. అతి తక్కువగా పెనుకొండ స్థానానికి 9 మంది పోటీ పడుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారహోరు పెంచారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. నామినేషన్ల దాఖలు మొదటి రోజునుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ విస్తృత ప్రచారం చేపట్టాయి. అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారంలో మరింత స్పీడు పెంచనున్నారు. ఆరు నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావడంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులతో పాటు బందుగణం విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రచారానికి మరో 12 రోజులు మాత్రమే గడువు ఉంది. ఈలోగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ వెళ్లి, ప్రచారం చేయాలన్న ప్రణాళికలతో మంది మార్బలాన్ని వెంటవేసుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

తేలిన అభ్యర్థుల లెక్క
ఎంపీ బరిలో 13 మంది..
అసెంబ్లీ స్థానాల పోటీలో 78 మంది..



వారు.. ఉపసంహరించుకున్నారు..



నామినేషన్ ఉపసంహరించుకుని వస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సునీల్‌కుమార్



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న సిమెంటు పోలన్న

మడకశిరటౌన్: తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా మడకశిర బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, ఆయన తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్ సోమవారం నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలనీ, భవిష్యత్తు ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, హిందూపురం పార్లమెంటు ఎన్నికల పరిశీలకుడు పూల నాగరాజు తదితరులు మడకశిరకు వచ్చి ఈరన్న, ఆయన కుమారుడు డాక్టర్ సునీల్‌కుమార్‌తో చర్చలు జరిపారు. అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుందామనీ, పార్టీ అధికారంలోకి రాబోతోందనీ, తప్పక న్యాయం చేకూరుతుందని వారు చెప్పడంతో నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు గెలుపు కోసం తాము కృషి చేస్తామని ప్రకటించారు.

సిమెంటు పోలన్న కూడా..

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి టీడీపీ రెబల్‌గా నామినేషన్ వేసిన సిమెంటు పోలన్న ఉపసంహరించుకున్నారు. సోమవారం రిటర్నింగ్ అధికారిని కలిసి నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని గెలిపించుకునే లక్ష్యంతోనే తాను పుట్టపర్తి అసెంబ్లీ బరిలో నుంచి తప్పుకుంటున్నానన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేసి, ఉమ్మడి అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.


పోరులో నిలిచింది వీరే..



నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	తిరస్కరణ	ఉపసంహరణ	పోటీలో ఉన్న అభ్యర్థులు
హిందూపురం ఎంపీ	24	9	2	13
మడకశిర	22	6	3	13
హిందూపురం	21	8	0	13
పెనుకొండ	11	1	1	9
పుట్టపర్తి	27	11	1	15
ధర్మవరం	18	3	0	15
కదిరి	18	5	0	13
మొత్తం	117	34	7	91

ప్రధాన పోటీదారులు వీరే...

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
హిందూపురంఎంపీ	బీకే పార్థసారథి	జె శాంత	సమద్ షాహీన్
మడకశిర	ఎంఎస్ రాజు	ఈరలక్కప్ప	కరికెర సుధాకర్
హిందూపురం	నందమూరి బాలకృష్ణ	టీఎన్ దీపిక	ఎంహెచ్ ఇనాయతుల్లా
పెనుకొండ	ఎస్ సవిత	కేవీ ఉష	నరసింహప్ప
పుట్టపర్తి	పల్లె సింధూరారెడ్డి	దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి	మధుసూదన్ రెడ్డి
ధర్మవరం	సత్యకుమార్ (బీజేపీ)	కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి	అశ్వత్థనారాయణ
కదిరి	కందికుంట వెంకటప్రసాద్	బీఎస్ మక్బూల్	కేఎస్ షానవాజ్



మడకశిరను సస్యశ్యామలం చేస్తాం

కృష్ణా జలాలతో అన్ని చెరువులు నింపుతాం



గుడిబండ, ఏప్రిల్ 29: అధికారంలోకి రాగానే హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను తీసుకొచ్చి మడకశిర నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపుతామనీ, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు ఉద్ఘాటించారు. మండలంలోని జి.మోరుబాగల్, మోరుబాగల్, తాళికెర, ముతుకూరు, మందలపల్లి, కొంకల్లు, సీసీగిరి, ఎస్ రాయాపురం గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి, గెలిపించాలనీ, నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. టీడీపీ ప్రచారానికి అన్ని గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఉమ్మడి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, మంజునాథ్, లక్ష్మీనరసప్ప, రాజు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంఎస్ రాజు, బీకే

18 కుటుంబాలు టీడీపీలో చేరిక

మడకశిరటౌన్: పట్టణంలోని రెండో వార్డు మల్లినాయనపల్లికి చెందిన అంజమ్మ, రఘురాం తదితరుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 18 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి.. వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.

9లోగా డైట్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోండి



కొత్తచెరువు, ఏప్రిల్ 29: డైట్‌సెట్‌కు మే 9వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. రెండేళ్ల ఈ టీచర్ ట్రైనింగ్ కోర్సు ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు cse.ap.gov.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మండే ఎండ మరి..



తాగునీటి బోరుకింద సేద తీరుతున్న చిన్నారి

భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. ఇంట్లో ఉక్కపోత, బయటికెళ్తే ఎండ. ఎక్కడా ఉండలేక జనం విలవిల్లాడు తున్నారు. తనకల్లు మండలంలోని గుట్టమీద తండా వద్ద సోమవారం మధ్యాహ్నం ఓ బాలుడు బోరు నుంచి దుముకుతున్న నీటి కింద నిలబడి అందులో తడుస్తూ ఇలా.. ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నాడు. - తనకల్లు

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 27.0	40.0 26.0	42.0 27.0	39.0 26.0	41.0 27.0

మంత్రి జడ్జిమెంట్..!

చెప్పుదెబ్బలు తిన్నా.. రాజీకి రావాల్సిందే..

కాళ్లతో రాకుతామన్నా మాట వినాల్సిందే..





బీసీ మంత్రి ఇలాఖాలో పెద్దలదే రాజ్యం
చేతులు కలిపినా.. మనసులు కలవలేదు..

హిందూపురం, ఏప్రిల్ 29: ఆ నియోజకవర్గంలో దాడులు చేసినా, చెప్పుదెబ్బలు తిన్నా, తిట్లపురాణం విన్నా.. మంత్రి పిలిపించి జడ్జిమెంట్ ఇస్తే నోరుమూసుకుని వెళ్లాల్సిందే. అధికార పార్టీలోని ఓ సామాజికవర్గం నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నట్లు బడుగు బలహీనవర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల చెప్పుదెబ్బలు తిన్నవారు బండబూతులు తిట్టించుకున్న వారు, ఇళ్లపై దాడులకు వచ్చినవారు వీరిచేతిలో బాధితులుగా మిగిలారు. మంత్రి జడ్జిమెంట్ ఇస్తే శిరసా వహించాల్సిందేనంటూ అధికార పార్టీలో ఓ వర్గం బహిరంగంగా చెప్పుకుంటోంది. బీసీ మంత్రి అయినా బలమైన సామాజికవర్గానిదే పైచేయి అన్నది బహిరంగ రహస్యం.

రాజీకి రావాల్సిందే..

ఇటీవల ఆ నియోజకవర్గంలోని ఓ మండలంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు.. మరో నాయకుడిపై దాడి చేయించాడు. పదుల సంఖ్యలో జనం చూస్తున్నా సదరు నాయకుడిపై చెప్పుతో కొట్టించాడు. ఇది ఆ మండల కేంద్రంలో ఆరోజు తీవ్ర చర్చనీయాంశమైంది. అయినా కొట్టించిన వ్యక్తిని, దెబ్బలు తిన్న వ్యక్తిని పిలిపించి మంత్రి చేతులు కలిపి రాజీచేశారు. వారిలో ఒక నాయకుడు సదరు ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లడానికి సంకోచించాడు. ఇదంతా ఆ ప్రజాప్రతినిధికి తెలిసే జరుగుతోందని భావించి మదనపడ్డాడు. ఎన్నికల సమయం కావడంతో ఎందుకొచ్చిందిలే అని ఇరువురు నాయకులను పిలిచి, చేతులు కలిపి పంపించేశారు.

అయినా.. మాట వినాల్సిందే..

ఓ మండలంలో ఇటీవల ప్రజాప్రతినిధి సమక్షంలో బీసీ కులానికి చెందిన తండ్రీకొడుకులను స్థానికంగా కీలకంగా వ్యవహరించే ఓ నాయకుడు చెప్పుకాళ్లతో రాకుతామని దుర్భాషలాడాడు. అయినా సదరు ప్రజాప్రతినిధి తిట్టించుకున్న వారిని వదిలేసి, తిట్టిన నాయకుడివైపే నిలవడం గమనార్హం. దీంతో తిట్టించుకున్న నాయకుడి సామాజికవర్గానికి చెందిన వారు ఇలాంటి పార్టీలో తమలాంటి వారు ఉండటం దురదృష్టకరమనీ, ఎన్నికల్లో తమ బలమేంటో చూపాలని చర్చించుకున్నారు. ఆ సామాజికవర్గానికి చెందిన నాయకుడు కొన్నిరోజుల క్రితం సమావేశమై రహస్యంగా ఎజెండాను తయారు చేసినట్లు సమాచారం. ఆ మండలంలో ఆ నాయకుడి ప్రతాపంపై నివ్వెరపోవడమేకాక తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

బీసీ మంత్రి ఇలాఖాలో వారిదే రాజ్యం..

పేరుకే బీసీ మంత్రి. ఆ నియోజకవర్గంలో అధికార పార్టీలో జరిగేదంతా బలమైన సామాజికవర్గానిదే. వారు ఏం చెబితే అది వినాల్సిందే. ఎందుకంటే కొన్నిరోజుల క్రితం వరకు ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా ఉన్న ఓ నాయకుడు ఇటీవలిగా చెలరేగిపోతున్నట్లు సమాచారం. అతడు నెల క్రితం అదే మండలంలో ఓ నాయకుడి ఇంటిపైకి కొడవలితో దాడి చేయడానికి వెళ్లాడు. బాధితుడిని చేరదీయాల్సిందిపోయి ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధి దాడిచేయడానికి వెళ్లిన వారికే వత్తాసు పలకడం శోచనీయం. దీంతో బాధితుడు నెల రోజులుగా ఎవరికీ అందుబాటులోకి రాకుండా ఫోన్ స్విచాఫ్ చేసుకుని, వేరే ప్రాంతానికి వెళ్లినట్లు ఆ నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. పేరుకే బీసీ మంత్రి ఆ ఇలాఖలో అధికార పార్టీకి చెందిన బలమైన సామాజికపార్టీదే పైచేయి. వారు చెప్పినట్లు వినాల్సిందే. వారి సూచన మేరకే మంత్రి కూడా జడ్జిమెంట్ ఇస్తున్నట్లు చర్చోపచర్చలు సాగుతున్నాయి.

వైసీపీ కవ్వింపు చర్యలు





పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29: మండలంలోని కుసుమవారిపల్లిలో టీడీపీ ప్రచారం సందర్భంగా వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి భర్త పల్లె వెంకటక్రిష్ణకిషోర్ రెడ్డి కుసుమవారిపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైసీపీ ప్రచార రథం తరచూ పాటలు పెట్టుకుని అడ్డు తగులుతుండడంతో ఆ వాహన డ్రైవర్‌ను టీడీపీ వర్గీయులు మందలించారు. దీంతో వైసీపీ, టీడీపీ మధ్య మాటామాటా పెరిగి, వాగ్వాదానికి దారి తీసింది. ఆ సమయంలో టీడీపీ వర్గీయులు రాయి రువ్వి, ప్రచార రథం అద్దం పగులగొట్టారని వైసీపీ వారు వాగ్వాదానికి దిగారు. తాము రాయి రువ్వలేదని చెప్పినా వైసీపీ వర్గీయులు ఘర్షణకు దిగారని టీడీపీ వారు పేర్కొంటున్నారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ప్రచార రథంపై దాడి చేశారన్న అనుమానంతో టీడీపీకి చెందిన గంగిరెడ్డి, జెరిపిటి అంజినప్పపై వైసీపీ నాయకులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం దిగువపల్లిలో ప్రచారంలో ఉన్న టీడీపీ వారిని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ వంశీకృష్ణ అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. తప్పు ఎవరిందని విచారించకుండా అధికార పార్టీ ఫిర్యాదు చేస్తే ఎలా అరెస్టు చేశారంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. అక్కడే బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. సీఐ.. పల్లె వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డితో మాట్లాడారు. తమ పార్టీవారు తప్పు చేయలేదనీ, పోలీసులకు సహకరిస్తారని చెప్పారు. దీంతో కార్యకర్తలు, నాయకులు శాంతించారు. అనంతరం పోలీసులు గంగిరెడ్డిని అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర.. వైసీపీ ప్రచార రథ వాహనదారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కంకర తేలిన శీర్పి- విరుపాపల్లి రోడ్డు

పాలకులారా.. పరిశ్రమలు ఏవీ..?

- సెజ్‌ల పేరిట వేల ఎకరాల సేకరణ
- ఏళ్లు గడిచినా ప్రారంభం కాని పరిశ్రమలు
- ఇప్పటికే మూతపడిన స్థానిక ఫ్యాక్టరీలు
- ఉపాధి కోసం వలస వెళ్తున్న ప్రజలు
- అభివృద్ధికి దూరంగా మడకశిర ప్రాంతం

మడకశిర

వెనుకబడిన మడకశిర ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి, ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భూములు సేకరించి ఏళ్లు గడుస్తున్నా ఒక్క ఫ్యాక్టరీ కూడా ఇక్కడ ప్రారంభం కాలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. స్థానికంగా నీటి వసతి లేకపోవడంతో వ్యవసాయం కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని సెజ్‌ల పేరుతో ప్రభుత్వం పదేళ్ల కిందట రైతుల నుంచి భూమి సేకరించింది. దీంతో సాగు చేస్తున్న భూమి పోవడం, పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో రైతులు, కూలీలు ఉపాధి కోసం బెంగళూరు, మైసూరు, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీలు మడకశిర అభివృద్ధిని తమ మేనిఫెస్టోలో చేర్చి, ఆమేరకు అమలు చేయాలని కోరుతున్నారు.

మంత్రిమండలి ఆమోదం తెలిపినా ముందుకు పడని అడుగు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాది కిందట జరిగిన మంత్రిమండలి సమావేశంలో మడకశిర మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఆమోదించారు. కాని నేటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు. మడకశిర మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలోనే వేల ఎకరాల భూములను సేకరించారు. అందుకు సంబంధించి పరిహారం చెల్లించారు. 2012లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి భూములు సేకరించారు. మడకశిర మండలం గౌడనహళ్లి, ఆర్. అనంతపురం, చత్రం గ్రామాల పరిధిలో 1600 ఎకరాలు సేకరించారు. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి వద్ద 2006లో 1230 ఎకరాల భూమిని సేకరించారు. అయితే పరిశ్రమలు మాత్రం నెలకొల్పలేదు.



పదేళ్ల కిందట మూతపడిన ట్విస్టింగ్ యూనిట్

ఇంటికో ఉద్యోగం ఏదీ?

భూములు సేకరించేటప్పుడు పరిశ్రమలు నెలకొల్పి ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. కానీ నేటి వరకూ ఒక్క పరిశ్రమా రాలేదు. ఒక్కరికీ ఉపాధి దొరకలేదని స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భూములు కూడా పోవడంతో స్థానికంగా ఉపాధిలేక వలస వెళ్తున్నామని వా రు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప రిశ్రమలు నెలకొల్పక పోతే తమ భూములు వెనక్కు ఇవ్వాలని రైతులు డిమాండు చేస్తున్నారు.



పరిశ్రమల కోసం కేటాయించిన భూములు

ఉన్న పరిశ్రమలు మూత

మడకశిర ప్రాంతంలో ఉన్న అరకొర పరిశ్రమలు కూడా మూతపడటంతో చాలామంది ఉపాధి కరువై కర్ణాటక ప్రాంతానికి వలస వెళ్తున్నారు. మడకశిరలో ట్విస్టింగ్ యూనిట్, రీలింగ్ యూనిట్ ద్వారా ఉపాధి పొందేవారు. దాన్ని పదిహేనేళ్ల కిందట మూసి వేయడంతో చాలమందికి ఉపాధి కరువైంది. ట్విస్టింగ్ యునిట్‌లో పనిచేసినవారు ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. మడకశిర మండలం నీలకంఠాపురంలో కన్స్ పరిశ్రమ ద్వారా 200నుంచి 300 దాకా ఉపాధి పొందేవారు. దాన్ని కూడా రెండేళ్ల కిందట మూసి వేశారు. హిందూపురం వద్ద ఏర్పాటు చేసిన గార్మెంట్స్ పరిశ్రమ రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పరిశ్రమ ప్రారంభం అయితే వెయ్యి మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

స్థానికంగా పనులు లేవు

మాకు స్థానికంగా ఎలాంటి పనులూ లేవు. దీంతో మాకు దగ్గరగా ఉన్న కర్ణాటక ప్రాంతానికి ఉపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు కురవకపోవడం, స్థానికంగా పనులు లేకపోవడంతో చాలా మంది బెంగళూరుకు పనులు నిమిత్తం వలస వెళ్తున్నారు. అక్కడ కూడా వెంటనే పనులు దొరకవు. పండుగలకు, ఇతర అత్యవసర పనులు పడినప్పుడు మాత్రమే సొంతూళ్లకు వస్తాం. స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే మాకు ఈ బాధతలు తప్పుతాయి.

మారన్న , కొత్తపాళ్యం, రొళ్ల మండలం



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని గార్మెంట్ పరిశ్రమ

అధ్వానంగా గ్రామీణ రహదారులు

బెళుగుప్ప, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శీర్పి నుంచి విరపాపల్లికి వెళ్లే రోడ్డు ఐదు కిలోమీటర్లు కంకర తేలి అధ్వానంగా ఉంది. కాలినడకన వెళ్లడానికి కూడా వీలు కాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వెంకటాద్రిపల్లి, శీర్పి గ్రామాల ప్రజలు వ్యవసాయ తోటల్లోకి ద్విచక్ర వాహనాలలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలంలో మరింత దారుణంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రయాణానికి ఇన్ని ఇబ్బందులు పడుతున్నా రోడ్ల బాగుకోసం గత ఐదేళ్లగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శ్రీరంగాపురం నుంచి బూదివర్తికి వెళ్ల రోడ్డుకూడా గుంతలమయమై అధ్వానస్థితిలో ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తమకు కష్టాలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం.



పాడైపోయిన బూదివర్తి రోడ్డు

ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

- శింగనమల నియోజకవర్గంలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై నిఘా
- రౌడీషీటర్ల బైండోవర్
- పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక దృష్టి



బుక్కరాయసముద్రం

ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమంటే అధికారులకు కత్తిమీద సామే. ఫ్యాక్షనిజం, అధిపత్య పోరు కల్గి ఉన్న గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఎన్నికలు పోలీసులకు సవాలుగానే చెప్పాలి. రెండు పార్టీలకు గెలుపే ధ్యేయంగా భావిస్తుండటంతో వాతావరణం వేడెక్కింది. దీంతో పోలీసులు, ఎన్నికల విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసు అధికారులు సమస్యాత్మక గ్రామాలపై డేగకన్ను పెట్టారు. 1994, 1999, 2004, 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రీపోలింగ్, రిగ్గింగ్, రీ సైక్లింగ్, ఇరువర్గాలు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల సమయంలో గొడవలు, ఇతర సంఘటనల ఆధారంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు.

సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ



ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సమస్యాత్మక గ్రామాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఎన్నికల సందర్భంగా తొలుత ఆరు మండలాల్లోని రౌడీషీటర్లను బైండోవర్ చేసి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాజకీయ నేతలపై నేర చరిత్ర కల్గిన కేసులు ఉంటే బైండోవర్ చేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఎలాంటి కేసులు లేని నేతలపై బైండోవర్ చేసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఫ్లాగ్ మార్చ్, నాకాబందీ నిర్వహిస్తున్నారు. అనుమానపు వ్యక్తులు, ఫ్యాక్షన్ నేతల ఇళ్లలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు.

పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక నిఘా



శింగనమల నియోజకవర్గంలోనే ప్రత్యేకమైన పుట్లూరు, శింగనమల మండలాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎన్నికలు సవ్యంగా సాగాలంటే అన్ని విభాగాల అధికారులు సమగ్ర అధ్యయనం చేసి సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పలుచోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో పలు గ్రామాల్లో రీసైక్లింగ్, రిగ్గింగ్ జరిగిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బైండోవర్, సమస్యాత్మక గ్రామాలు ఇవే..

నియోజకవర్గంలో అత్యంత సమస్యాత్మక మండలంగా యల్లనూరును గుర్తించారు. ఈ మండలంలో 15 గ్రామాలను గుర్తించి ఇరు పార్టీలకు చెందిన 469 నేతలు, కార్యకర్తలు ముందుస్తుగా బైండోవర్ చేశారు. కల్లూరు, వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి, యల్లనూరు, మేడకుర్తి, అచ్యుతాపురం, దంతాలపల్లి, నిడిజంపల్లి, కూచివారిపల్లి, చింతకాయమందా, సింగవరం, వేములపల్లి, గడ్డంవారి వెంకటంపల్లిని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు బుక్కరాయసముద్రం మండలంలో 9 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 410 మందిని బైండోవర్ చేశారు. చెన్నంపల్లి, వడియంపేట, కేకే ఆగ్రహారం, నీలంపల్లి, రేగడికొత్తూరు, బి. కొత్తపల్లి, జంతులూరు, వెంకటాపురం, బొమ్మలాటపల్లి గ్రామాలను పోలీసులు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మండల వ్యాప్తంగా పలువురు వైసీపీ, టీడీపీ, సీపీఐకి చెందిన మద్దతుదారులు, రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. గార్లదిన్నె మండలంలో ఆరు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 600 మందిని బైండోవర్ చేశారు. ఈ మండలంలో గార్లదిన్నె, మర్తాడు, పెనకచెర్ల, కేశవాపురం, ఇల్లూరు, కల్లూరు గ్రామాలను అత్యంత సమస్యాత్మకంగా తేల్చారు. శింగనమల మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 306 మందిని బైండోవర్ చేశారు. నిదనవాడ, సి.బండమీదపల్లి, ఉలికల్లు, సలకంచెరువు, కల్లుమడి తరిమెలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఇప్పటి వరకు మండలంలో టీడీపీ, వైసీపీ, సీపీఐకి చెందిన 306 మందిని బైండోవర్ చేపట్టారు. పుట్లూరు మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 470 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో ఏడు గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో మడుగుపల్లి, చాలవేముల, మడ్డిపల్లి, కోమటికుంట్ల, కుమ్మనమల, అరకటవేముల, గరుగుచింతలపల్లి ఉన్నాయి. ఇప్పటి వరకు 470 మందిని బైండోవర్ చేపట్టారు. నార్పల మండలంలో ఏడు గ్రామాలు అత్యంత సమస్యాత్మకమైనవి ఉండగా 507 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో నార్పల, బండ్లపల్లి, కర్లపుడికి, గడ్డంనాగేపల్లి, వెంకటంపల్లి, నడిమిదొడ్డి, పులుసుల నూతల గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఇప్పటి వరకు 507 మంది బైండోవర్ చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపడుతున్నాం. ఎన్నికలకు విఘాతం కల్గించే వారిపై నిఘా పెంచాం. గ్రామాల్లో పర్యటించి ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా విధించాం.

- బి.వీరశివారెడ్డి, డీఎస్పీ, అనంతపురం రూరల్



చెన్నంపల్లిలో పోలీసుల కౌన్సెలింగ్ (ఫైల్)

ఏర్పాట్లకు నిధులేవీ..?





- పోలింగ్ స్టేషన్లపై చేతులెత్తేశారు
- ఒక్క రూపాయి ఇవ్వని అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ స్టేషన్లు
- ఏర్పాట్లు చేయాలంటూ సెక్టార్ ఆఫీసర్లపై ఒత్తిడి
- నాడు-నేడు, ఎస్ఎంఎఫ్ నిధులు వాడుకోవాలని సలహా
- ఓటర్లకు తిప్పలు తప్పవా..?

అనంతపురం విద్య, ఏప్రిల్ 29 : ఎన్నికల సమయం సమీపిస్తోంది. పోలింగ్ తేదీ రాగానే అందరికీ గుర్తొచ్చేవి పోలింగ్ స్టేషన్లు. పోలింగ్ స్టేషన్లలో కనీస సదుపాయాలు కల్పించాలి. గతంలో పోలింగ్ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేసేవారు. దీంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించి పోలింగ్ నాటికి అన్నీ సిద్ధం చేసేవారు. ఇప్పుడు కూడా పనులు చేయండి అంటూ ఆదేశిస్తున్నారు కానీ.. ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదు. జిల్లాలోని సెక్టార్ ఆఫీసర్లకు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన బాధ్యతలు అప్పగించారు. చిల్లిగవ్వ ఇవ్వకుండా ఏర్పాట్లు ఎలా అంటూ వారు మింగలేక, కక్కలేక, ఎవరికి చెప్పకోవాలో తెలియక నలిగిపోతున్నారు. పాఠశాలలకు నాడు-నేడు మిగిలిన డబ్బులు, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్స్(ఎస్ఎంఎఫ్)తో మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రూట్లు	సెక్టార్లు	సెక్టార్ ఆఫీసర్లు
రాయదుర్గం	296	32	32	34
ఉరవకొండ	263	32	32	37
గుంతకల్లు	276	29	29	31
తాడిపత్రి	274	29	29	32
శింగనమల	293	30	30	32
అనంతపురం అర్బన్	292	30	30	34
కళ్యాణదుర్గం	261	25	25	27
రాప్తాడు	281	34	34	36
మొత్తం	2,236	241	241	263

కేంద్రాల్లో ఏర్పాట్లు ఎలా...?

జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో విడుదల చేసిన గెజిట్‌లో అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు కలిపి 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,236 కేంద్రాలు ఉన్నాయి. చాలా పోలింగ్ కేంద్రాలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నాయి. కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైటింగ్‌తో పాటు, మరుగుదొడ్లు, తాగు నీరు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయాలి. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్ల వల్ల సమస్యాత్మకంగా ఉంటే...ఆ పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బాధ్యతలను సెక్టార్ అధికారులకు అప్పగించారు. ఈ ఏర్పాట్లకు డబ్బులెలా అని సెక్టార్ ఆఫీసర్లు సతమతమవుతున్నారు.

డబ్బుల్లేక అధికారుల గగ్గోలు

జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలుంటే....241 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో అధికారి చొప్పున 241 మందితోపాటు అదనంగా 22 మంది (రిజర్వు)ని నియమించారు. వందలాది కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయి. ర్యాంపులు, మరుగుదొడ్లు , ఫ్యాన్లు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేయాలంటే..వేలాది రూపాయలు ఖర్చవుతుంది. అప్పటికే ఉన్న మెట్లపై ర్యాంపు ఏర్పాటు చేయాలన్నా... కొత్తగా మెట్లు పెట్టించి ర్యాంపు ఏర్పాటు చేయించాలన్నా...రమారమి రూ. 4 వేల నుంచి రూ. 6 వేల వరకూ వ్యయమవుతుందని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బారికేడ్ల ఏర్పాటుకు సైతం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇప్పటి వరకూ సెక్టార్ అధికారులకు ఉన్నతాధికారులు డబ్బులు ఇవ్వలేదు. స్కూళ్ల ఆవరణలో ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఏవైనా సదుపాయాలు చేయాలంటే.... నాడు-నేడు పనులు జరుగుతున్న స్కూళ్లలో నిధులు మిగిలి ఉంటే..వాటిని సర్దుబాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారని తెలిసింది. నాడు-నేడు పనులు జరగని పాఠశాలలు ఉన్న పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఈ సదుపాయాలు చేయాలంటే ఎలాగని తలలు పట్టుకుంటున్నారు. వివిధ శాఖ అధికారులను సెక్టార్ ఆఫీసర్లుగా వేశారు. వాళ్లకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి అవి ఏ శాఖ పరిధిలోకి వస్తున్నాయో కనుక్కుని, ఆ శాఖల అధికారుల వద్దకు వెళ్లి ఈ ఏర్పాట్లు చేయాలంటే ఎలా అంటూ గగ్గోలు పెడుతున్నారు. దీంతో అటు సెక్టార్ ఆఫీసర్లు, ఇటు సంబంధిత అధికారులు డబ్బుల్లేక బిక్కమొహాలేసి చూసుకునే దుస్థితి నెలకొంది.

తక్కువ సమయంలో పనులు సాధ్యమేనా..?

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. వచ్చే నెల 13వ తేదీనే పోలింగ్. 12వ తేదీ నుంచే ఆ కేంద్రాలు అధికారుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. అంటే 11వ తేదీ నాటికి అక్కడ ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు కావాల్సిందల్లా డబ్బు. గతంలో నిధులు కేటాయించి పనులు చేయమని చెప్పేవారు. ఈ దఫా మాత్రం చిల్లి గవ్వ ఇవ్వకుండా పనులు చేయాలని ఆదేశాలిస్తే తాము ఏమి చేయాలని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు.



అనంతపురం రూరల్‌లోని పాఠశాలలో పోలింగ్ బూత్‌లు

ఓటేసేకి ఊరికి రాండన్నో..



హలో.. నమస్తే అన్నా, నమస్తే అక్క బాగున్నారా? యా ఊర్లో ఉండారు? ఎలచ్చన్లు వచ్చే నెల 13న ఉండాయి. మీ అందరూ తప్పకుండా ఊరికి రావల్ల. ఇండి ఆడ మనూరోళ్లు ఎంతమంది ఉండారు. వాళ్ల ఫోన్ నంబర్లు కూడా ఇయ్యండి. వాళ్లని రమ్మని సెబుతాం. మీరు రొండు దినాలు ముందే రాండన్నా. ఆడ మనోళ్లు ఎంతమంది ఉండారో కచ్చితంగా సెబితే వచ్చి పొయ్యేదానికి శార్జీలకు దుడ్లు ఫోన్‌పేలో చేస్తాం. ఇలా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ప్రజలను స్థానిక నాయకులు ఫోన్ చేసి అడుగుతున్నారు. మండలం నుంచి బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు అనేకమంది వలస వెళ్లారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వారిని ఓటింగ్‌కు రప్పించేందుకు ఆయా గ్రామాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో రానుపోను చార్జీలు భరించడంతో పాటు ఓటుకు ఇంత అని ముట్టచెప్పడానికి సైతం అభ్యర్థుల అనుచరులు వెనుకాడటం లేదు. ఓటరు జాబితా తీసుకుని వలస ఓటర్ల పేర్లు, సీరియల్ నెంబర్, బూత్ నెంబర్ వారిగా మరో జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- ముదిగుబ్బ

సమస్యలు ఇస్త్రీ చేసేస్తా



రాయదుర్గం 24వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఓ రజకుడిని ఓటు అభ్యర్థిస్తూ దుస్తులు ఇస్త్రీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు



పల్లె సింధూరరెడ్డిని దీవిస్తున్న వృద్ధురాలు

బిడ్డా.. మా ఓట్లన్నీ నీకే..!

ఎండనపడి తిరుగుతూ ఎంత కష్టపడుతున్నావు తల్లీ..! మా ఓట్లన్నీ తప్పకుండా నీకే వేస్తాం. బిడ్డా..! నువ్వు సల్లగుండాలి అంటూ ఎన్నికల ప్రచారంలో ఉన్న పల్లె సింధూరారెడ్డిని ఓ వృద్ధురాలు ఆశీర్వదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సింధూరారెడ్డి అమడగూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఓవృద్ధురాలు పల్లె సింధూరను దగ్గరకు పిలిచి తలపై పూలు వేసి నీవు చల్లగా ఉండాలంటూ ఆశీర్వదించారు.

- పుట్టపర్తి

చిరు వ్యాపారులకు ఒరిగిందేమీ లేదు



వెంటేశ్ గుప్తా, చిరు వ్యాపారి

వైసీపీ పాలనలో చిరువ్యాపారులకు ఒరిగిందేమీ లేదు. గత ఎన్నికల సమయంలో జగన్ ఒక్క చాన్స్ అంటే ఇచ్చాం. గెలిచాక మమ్మల్ని పట్టించుకున్నదేలేదు. చిన్న వ్యాపారులో కొంత మందికి మాత్రమే రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈరోజుల్లో ఆ మొత్తం దేనికి సరిపోతుంది. మేము కూడా చిన్న వ్యాపారులకు ఆర్థిక సాయం అందించాం అని వైసీపీ నాయకులు చెప్పుకోవడానికి మాత్రమే సరిపోతుంది.

- మడకశిర రూరల్

కొత్త పథకాలు ఏవీ..?



నారాయణనాయక్, నిరుద్యోగి

వైసీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను పరిశీలిస్తే అందులో కొత్తపథకాలు లేవు. పాతవాటినే తిరగరాసి, నవరత్నాలు ప్లస్ అంటున్నారు. గతంలో హామీ ఇచ్చిన సీపీఎస్ రద్దు, మద్య పాన నిషేధం చేయలేదు. వైసీపీ మేనిఫెస్టోను చూసి, ఆపార్టీ కార్యకర్తలే ఉసూరుమంటున్నారు. ఉపాధి, ఉద్యోగ కల్పనలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

- కదిరి అర్బన్

ఎంత బరితెగింపూ.. రాజీనామా చేయాలట..!

వలంటీర్లకు 'విశ్వ' ఆదేశాలు

విడపనకల్లు, ఏప్రిల్ 29: వలంటీర్లు రాజీనామా చేసి వైసీపీ విజయానికి కృషి చేయాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై విశ్వేశ్వరరెడ్డి ఆదేశించినట్లు సమాచారం. ఉరవకొండలోని వైసీపీ కార్యాలయంలో విడపనకల్లు మండలానికి చెందిన 19 గ్రామాల వలంటీర్లతో సోమవారం రాజకీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వలంటీర్లలో ఇంకా ఎవరైనా రాజీనామా చేయని వారు ఉంటే ఖచ్చితంగా చేయాలని, మీ భవిష్యత్తుకు నాది గ్యారెంటీ అని అభయం ఇచ్చినట్లు సమాచారం. అందరూ కష్టపడి వైసీపీని గెలిపించాలని సూచించినట్లు తెలిసింది. ఐదు రోజుల్లో గ్రామాల వారిగా టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, న్యూట్రల్ ఓటర్లను గుర్తించాలని, టీడీపీ ఓటర్లను తప్ప మిగిలిన అందరిని తమ వైపు తిప్పుకునేలా ప్రచారం నిర్వహించాలని వలంటీర్లుకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే జగన్ ఇస్తున్న పథకాలు అన్ని మీకు రాకుండా పోతాయని బెదిరించే విధంగా ప్రచారం ఉండాలని సూచించినట్లు తెలిసింది.

1909లోనే భారతీయులకు ఓటు హక్కు



కదిరి అర్బన్, ఏప్రిల్ 29: దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్‌వారిపై భారతీయులు సాగించిన పోరాటంలో ఓటుహక్కు ఉద్యమం ఒకటి. నాటి పాలనలో అంతర్భాగమైన స్థానిక సంస్థలకు 1907లో నిర్వహించిన ఎన్నికల్లో భారతీయులకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమం సాగించారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఫలితంగా 1909లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ చట్టం ప్రకారం కొద్దిమంది భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. అప్పటినుంచి కొనసాగిన ఉద్యమాలతో 1935లో ఓటు హక్కును విస్తృతం చేస్తూ భారతీయుల ఓటు హక్కు శాతాన్ని 10.6శాతానికి పెంచారు. అనంతరం జరిగిన రాజ్యాంగపరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం ప్రజలకు ఓటు హక్కు వచ్చింది. 1947లో దేశానికి స్వాతంత్య్రం లభించాక ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి భారత రాజ్యాంగం 326 అధికారణ ప్రకారం 21సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు అమలు చేశారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది.

ఇప్పుడు గుర్తొచ్చిందా..?

హడావుడిగా ధర్మవరం-మేడాపురం రోడ్డు పనులు

అంతా ఓట్ల కోసమేనని విమర్శలు



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 29: పోలింగ్‌కు పద్నాలుగు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో వైసీపీ నాయకులు హడావుడిగా రోడ్డు పనులు ప్రారంభించారు. ధర్మవరం ఎర్రగుంట సమీపంలోని రైల్వేవంతెన నుంచి మేడాపురం వెళ్లే రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. దాదాపు వారం రోజులుగా పనులు సాగుతున్నాయి. దీంతో ఆ రోడ్డువెంట రోజు రాకపోకలు సాగిస్తున్నవారు ఎన్నికలు వచ్చినాయి కాబట్టి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి ఈ రోడ్డు గుర్తుకువచ్చింది. లేకపోతే ఇన్నేళ్లుగా రోడ్డు బాగాలేక ఇబ్బందులుపడుతున్నా పట్టించుకోలేదు. ఓట్ల కోసమే పనులు చేస్తున్నాడని బాహాటంగానే సెటైర్లు వేస్తున్నారు.


ఎన్నికల కోడ్ వర్తించదా..?

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రోడ్డు పనులు చేపట్టడమేమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే రోడ్డు మంజూరై ఉంటే ఇప్పుడు హడావుడిగా పనులు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికార దర్పంతో వైసీపీ నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పొంతనలేని పీఐయూ ఇంజనీరింగ్ అధికారుల వివరణ

ఈ రోడ్డు పనులపై పీఐయూ ఇంజనీరింగ్ అధికారులను విలేకరులు ఫోన్‌లో వేర్వేరుగా వివరణ కోరగా వారి నుంచి పొంతనలేని సమాధానం వచ్చింది. ముందుగా జేఈ నారాయణస్వామితో మాట్లాడగా రూ.30లక్షల జడ్పీ నిధులతో వర్క్‌ఆర్డర్ తీసుకుని పనులు చేస్తుమన్నారు. ఎన్నికల కోడ్ కన్నా ముందే మంజూరు ఉత్తర్వులు ఉన్నాయా అనేదానిపై సమాధానం దాటవేస్తూ నేను ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను అని ఆయన పేర్కొన్నారు. అనంతరం డీఈ రామచంద్రారెడ్డిని వివరణ కోరగా మార్చి 15న ఎమ్మెల్యే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రూ.20లక్షలతో కిలో మీటరున్నర రోడ్డు పనులు చేయాల్సి ఉండగా కాంట్రాక్టరు వల్ల పనులు ఆలస్యం జరిగిందన్నారు. అందుకే ఇప్పుడు మొదలుపెట్టారన్నారు.

విలక్షణం.. ఉరగాద్రి



ఉరవకొండ ముఖచిత్రం



స్వాతంత్య్రానికి పూర్వమే పంచాయతీ బోర్డుగా ఏర్పడిన ఉరవకొండ నానాటికి విస్తరించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీగా గుర్తింపు పొందింది. ఒక కొండ చుట్టూ ఊరు విస్తరించడం దీని ప్రత్యేకత. పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జిల్లాలోనే ప్రసిద్ధి చెందినది. రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయం బూదగవి గ్రామంలో ఉంది. ఉరవకొండ నియోజకవర్గంలో ఎక్కువ భాగం వ్యవసాయమే జీవనాధారం. సాగు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి.

స్వాతంత్య్రానికి ముందే పంచాయతీ బోర్డు

అంచెలంచెలుగా అభివృద్ధి చెందిన ఉరవకొండ

పెన్నహోబిలం అభివృద్ధి పట్టని పాలకులు

వెంటాడుతున్న సాగు, తాగునీటి సమస్య

ఉరవకొండ



నియోజకవర్గ చరిత్ర

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే వైశాల్యం రీత్యా ఉరవకొండ మూడోది. గతంలో ఉరవకొండను ఉరగాద్రి అనే పేరుతో పిలిచేవారు. ఊరు మధ్యలో ఉన్న కొండ పాము పడగ ఆకారంలో ఉండటంతో ఈ పేరుతో పిలుస్తున్నట్లు తెలుస్తోంది. సంస్కృతంలో ఉర అంటే పాము పడగ అని, ఆద్రి కొండ అని అర్థం. పాము పడగ వలె ఉన్న కొండ కాబట్టి ఉరగాద్రిగా పిలిచేవారు. తర్వాతి కాలంలో ఉరవకొండగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉరవకొండ పట్టణం కొండ చుట్టూ అభివృద్ధి చెందుతూ పోవడం విశేషంగా చెప్పవచ్చు. స్వాతంత్య్రం సిద్ధించేందుకు ఆరు దశాబ్దాల ముందుగానే ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన పంచాయతీల్లో ఇదీ ఒక్కటి. 19 శతాబ్దంలోనే పంచాయతీ బోర్డుగా ఏర్పడింది. ప్రస్తుతం పట్టణంలో 45వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద మేజర్ పంచాయతీ. ప్రస్తుత నియోజకవర్గంలో మొత్తం 2,22,723 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,09,905, స్త్రీలు 1,12,788, ట్రాన్స్ జెండర్స్ 30 మంది ఉన్నారు. 259 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 1978లో కాంగ్రెస్ (ఐ) పార్టీకి చెందిన రాయల వేమన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకటనారాయణపై 19,987 ఓట్ల అత్యధి మెజారిటీతో గెలుపొందారు. 2009 టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ కాంగ్రెస్ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిపై 229 ఓట్ల అత్యల్ప మెజార్టీ సాధించారు. 2009కి ముందు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాలు మాత్రమే నియోజకవర్గంలో ఉండేవి. గుంతకల్లు మండలంలోని నాగసముద్రం, ఇమాంపురం, కదిరిపల్లి, గుర్రబ్బాడు, అయ్యవారిపల్లి, వెంకటాంపల్లి గ్రామాలు, పామిడి, కణేకల్లు మండలాల లోని పలు గ్రామాలు కలసి నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు,

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1962	గుర్రం చిన్నవెంకన్న	ఇండిపెండెంట్	దరూరు పుల్లయ్య	కాంగ్రెస్	4,730
1967	గుర్రం చిన్నవెంకన్న	కాంగ్రెస్	ఎస్. శివరామిరెడ్డి	ఇండిపెండెంట్	5,391
1972	బుక్కిట్ల బసప్ప	ఇండిపెండెంట్	వేమన్న	కాంగ్రెస్	2,163
1978	ఆర్.వేమన్న	కాంగ్రెస్ (ఐ)	పి.వెంకటనారాయణ	కాంగ్రెస్	19,986
1983	భీమిరెడ్డి	ఇండిపెండెంట్	రాయల వేమన్న	కాంగ్రెస్	15,078
1985	గుర్రం నారాయణప్ప	టీడీపీ	గోపీనాథ్	కాంగ్రెస్	9,376
1989	గోపీనాథ్	కాంగ్రెస్	గుర్రం నారాయణప్ప	టీడీపీ	16642
1994	పయ్యావుల కేశవ్	టీడీపీ	శివరామిరెడ్డి	ఇండిపెండెంట్	17,691
1999	వై.శివరామిరెడ్డి	కాంగ్రెస్	పయ్యావుల కేశవ్	టీడీపీ	8,501
2004	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	సీపీఎం	8,255
2009	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	కాంగ్రెస్	229
2014	వై.విశ్వేశ్వరరెడ్డి	వైసీపీ	పయ్యావుల కేశవ్	టీడీపీ	2,275
2019	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	వైసీపీ	2,132

తొలి ఎమ్మెల్యే చిన్న వెంకన్న



బెళుగుప్ప మండలాలు ఉన్నాయి. తొలిసారి 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన గుర్రం చిన్నవెంకన్న కాంగ్రెస్ అభ్యర్థి దరూరు పుల్లయ్యపై గెలుపొందారు. ఆయన స్వస్థలం ఉరవకొండ. వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పంచాయతీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1967లో రెండోసారి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కేబినేట్‌లో చిన్న పరిశ్రమల శాఖ

ఉరవకొండ నియోజకవర్గ చరిత్ర

మంత్రిగా పనిచేశారు.

ఉరవకొండ నియోజక వర్గం 1962 ఏర్పడింది. అంతకు మునుపు గుత్తి అసెంబ్లీలో ఉరవకొండ ఉండేది. నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత 13 సార్లు ఎన్నికలు జరిగాయి. 1962, 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. తర్వాత నాలుగు సార్లు 1967, 1978, 1989, 1999లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. 1983, 1985, 1994, 2004, 2009, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, 2014లో వైసీపీ అభ్యర్థి

ప్రముఖ ప్రదేశాలు

విజయం సాధించారు.

ఉరవకొండ మండలంలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఆలయం. రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయం బూదగవి గ్రామంలో ఉంది. వజ్రకరూరు మండలంలో జరుట్ల రాంపురంలో దక్షిణకాశీగా పిలుస్తున్న జరుట్ల రామలింగేశ్వ స్వామి దేవాలయం, కూడేరు జోడు లింగాల సంగమేశ్వరాలయం, విడపనకల్లు మండలంలో ఉండబండ వీరభద్రస్వామి దేవాలయం ప్రముఖమైనవి. పెన్నహోబిలంలోని హెచ్చెల్సీ



రెండుసార్లు మంత్రి పదవులు

కాలువ జలపాతం పర్యాటక కేంద్రంగా చెప్పుకోవచ్చు.

ఉరవకొండ నియోజకవర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో రెండుసార్లు మంత్రి పదవులు దక్కాయి. 1967లో గుర్రం చిన్నవెంకన్న ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కేబినేట్‌లో చిన్న పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున గుర్రం నారాయణప్ప గెలుపొందారు. ఎన్టీఆర్ హయాంలో ఆయన పౌరసరఫ

ప్రధాన సమస్యలు


రాలు, కరువు శాఖల మంత్రిగా పనిచేశారు.

- ఉరవకొండలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 10 రోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు. పలు గ్రామాల్లో వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.
- ఉరవకొండలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 44 లక్షలతో చేపట్టిన షాదీఖానా నిర్మాణం పనులు నిలిచిపోయాయి. నిధుల కొరతతో ఈ పనులు నాలుగేళ్లగా ముందుకు సాగలేదు.
- పాల్తూరు - కరకముక్కల, ఆర్.కొట్టాల - డొనేకల్లు వేళ్లే రహదారి పనులు ప్రారంభించి కంకరవేసి వదిలేశారు. ఉరవకొండ -ఇంద్రావతి, ధర్మపురి - చాబాల , చీకలగుర్కి- ఉరవకొండ, విరుపాయపల్లి - శీర్పి గ్రామాలకు వెళ్లే హదారులు అధ్వానంగా ఉన్నాయి.
- నియోజకవర్గంలో 80వేల ఎకరాలకు సాగు నీరు అందించే డిస్ట్రిబ్యూటరీ పనులు ఆగిపోయాయి.
- హంద్రీనీవా నుంచి షేక్షానుపల్లి, లత్తవరం, రాచర్ల చెరువులకు నీరు వదలక పోవడంతో సాగు, తాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగు నీరు అందించే రూ. 870కోట్ల మెగా డ్రిప్ ప్రాజెక్టు మూలన పడింది.
- పీఏబీఆర్ డిస్ట్రిబ్యూటరీ హెడ్ కూలిపోయి మూడేళ్లైనా నిర్మాణం చేపట్టలేదు. కాలువ కూడా అధ్వానంగా తయారైంది. సిమెంట్ పెచ్చులూడిపోయాయి. కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి నీరు పారేది ప్రశ్నార్థకంగా మారింది. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఆగిపోయాయి. కాలువ గట్లు భారీగా కోతకు గురయ్యాయి.
- రాకెట్ల, ఆమిద్యాల లిఫ్ట్ ద్వారా 10వేల ఎకరాలకు సాగునీరు అందించే పథకానికి భూమి పూజ చేసినా పనులు ప్రారంభించలేదు.
- ఇప్పేరు చెరువు మూడేళ్లుగా అడుగంటి పోయింది. జీడీపల్లి రిజర్వాయర్ దిగువ భాగాన గ్రామం ఉండటంతో ఊటనీరు గ్రామంలోకి ప్రవేశిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్అండ్ఆర్ కింద రూ. 55 కోట్లు మంజూరు చేశారు. సర్వేలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. అధికారంలోకి వస్తే మూడు నెలల్లోనే సమస్య పరిష్కరిస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చి ఏళ్లు గడిచినా నేటికీ నెరవేరలేదు.
- జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం పర్యాటక రంగం అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో పెన్నహోబిలం, పీఏబీఆర్, ఎంపీఆర్ ప్రాంతాలను పర్యాటక రంగం అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు చేశారు. అవి అమలుకు నోచుకోలేదు. పెన్నహోబిలం వద్ద హెచ్చెల్సీ నీటిని వదిలే సమయంలో జలపాతం చూపరులను ఆక

ఓటరు తీర్పు విలక్షణం

ట్టుకుంటుంది. ఆ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ఉరవకొండ నియోజకవర్గంలో గత 20 ఏళ్ల నుంచి ఓటర్ల తీర్పు విలక్షణంగా ఉంటోంది. నియోజకవర్గంలో గెలిచిన అభ్యర్థి పార్టీకి విరుద్ధంగా రాష్ట్రంలో అధికారం మరోపార్టీది ఉంటుంది. గత 20 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉంది. సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండ చేనేత రంగం పైన ఆధారపడి ఉంది. చేనేత రంగంపై ఆధారపడిన కార్మికులు



ప్రస్తుత ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
విడపనకల్లు	21,713	21,661	8	43,382
వజ్రకరూరు	21,561	21,738	6	43,305
ఉరవకొండ	32,793	34,838	9	67,640
బెళుగుప్ప	17,829	18,282	-	36,111
కూడేరు	16,009	16,269	7	32,285
మొత్తం	1,09,905	1,12,788	30	2,22,723



ఉరవకొండ పట్టణ ఓటర్లే కీలకం

ఉరవకొండ నియోజకవర్గంలో అత్యధికంగా వాల్మీకులు ఉన్నారు. తర్వాత కురుబ, ముస్లిం, చేనేత, కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఐదు మండలాల తీర్పు ఎలా ఉన్నా పట్టణ ఓటర్ల తీర్పే కీలకం. వీరిలో చేనేత, ముస్లిం ఓటర్లే అభ్యర్థుల గెలుపోటముల ప్రభావితం చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ఉరవకొండ పట్టణంలో వచ్చినటు మెజార్టీతోనే అభ్యర్థులు గెలిచారు. దీంతో ప్రధాన పార్టీలు ఉరవకొండపైనే దృష్టి సారించాయి.

ఐదోసారి ప్రత్యర్థులుగా కేశవ్, విశ్వ

ఆ నియోజకవర్గంలో తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఈ ఎన్నికల్లో తలపడుతున్నారు. పాత ప్రత్యర్థులిద్దరూ ఐదోసారి పోటీ పడుతున్నారు. అలాగే ఈసారి వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఉరవకొండలో త్రిముఖ పోటీ నెలకొంది. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీల నుంచి పోటీ పడుతుండడంతో వీరి పోరు ఎవరికి కలిసి వస్తుందోనన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైసీపీ ఓట్లు చీల్చుతారేమోనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఓట్ల చీలిక టీడీపీకి లాభిస్తుందన్న చర్చ నడుస్తోంది.

చేయి చేయి కలిపి..

రోడ్డు మరమ్మతులు చేసుకుంటున్న గడేకల్లు గ్రామస్థులు

విడపనకల్లు, ఏప్రిల్ 29: అందరికీ చెప్పి, చెప్పి విసిగిపోయిన పలువురు యువకులు రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టిన ఘటన మండలంలోని గడేకల్లు గ్రామంలో జరిగింది. గతంలో ఊరి చివరి నుంచి స్థానిక బస్టాండ్ వరకూ దాదాపుగా రెండు కిలోమీటర్ల జాతీయ రహదారి పనులు చేయకుండా గుంతలు తవ్వి వదిలేశారు. ఈదారిపై నిత్యం వందల వాహనాలు తిరుగుతుండటంతో విపరీతంగా ధూళి లేస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఐదేళ్లుగా రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. అయినా ప్రభుత్వంలో, అధికార యంత్రాం గంలో చలనం లేకపోయింది. ఎవరూ స్పందించక పోవటంతో గ్రామంలోని యువకులు విరాళాలు సేకరించి ట్రాక్టర్లు, లారీలతో కొండ గరుసును తరలించి జాతీయ రహదారిపై గుంతలకు మట్టిని వేసి జేసీబీలతో చదును చేయించారు. మా ఊరి రహదారిని ఇంకెప్పుడు బాగు చేస్తారంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మట్టి తోలుతున్న ట్రాక్టర్, టిప్పర్

కంకర పోస్తే.. తారు ఎవరేస్తారు?

మారుతీనగర్ కాలనీవాసులకు తప్పని తిప్పలు

గార్లదిన్నె, ఏప్రిల్ 29: తారు రోడ్డు వేస్తామని అప్పటి వరకు ఉన్న మట్టి రోడ్డును తవ్వేశారు. రోడ్డుపై కంకర వేశారు. తరువాత సిమెంట్ కానీ, తారు కానీ వేయడం మరచిపోయారు. దీంతో అది కంకర రోడ్డుగా మారిపోయింది. ఇదీ మండలంలోని కల్లూరు గ్రామం కొండకింద మారుతీనగర్‌లో రోడ్డు దుస్థితి. కాలనీ నుంచి సింగరప్ప కొండ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పనులను సుమారు రూ.90 లక్ష ల ఉపాధి నిధులతో ఆరునెలల కిందట ప్రారంభించారు. సుమారు 1.4 కిలోమీటర్ల రోడ్డు పనులు చేయాల్సి ఉంది. మారుతీనగర్ సమీపం నుంచి సింగరప్ప దేవాలయం వరకు తారురోడ్డు వేసి దాదాపు 400 మీటర్ల రోడ్డు వేయకుండా కంకర తోలి వదిలిపెట్టారు. దీంతో ఆ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగించే కాలనీ ప్రజలు, సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కంకర రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రతి రోజూ ఎవరో ఒకరు ప్రమాదాలకు గురి అవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే రోడ్డు పూర్తి చేయకున్నా పూర్తి చేసినట్లు బోర్డులు ఏర్పాటు చేసి పాలకులు డప్పులు కొడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు ఎక్కడ పూర్తి చేశారో చూపించాలని నిలదీస్తున్నారు.



రోడ్డు పూర్తి చేశామని ఏర్పాటు చేసిన బోర్డు



కల్లూరు కొండ కింద మారుతీనగర్‌లో కంకరతోలి వదిలేసిన రోడ్డు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: కందికుంట

గాండ్లపెంట, ఏప్రిల్ 29: కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని గొడ్డివెలగల పంచాయతీ దాసరవాండ్లపల్లి, గేదర్ల, పాలంవాండ్లపల్లి, నీరుకుంట్లపల్లి, ఎర్రగోగులపల్లి, వంకలోపల్లి, తుమ్మలబైలు పెద్దతండా, సాదులవాండ్లపల్లి, తుమ్మలబైలు, కోటినేపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే తూపల్లి పంచాయతీలోని వంకపల్లి, కటకంవారిపల్లి, పోరెడ్డిపల్లి గ్రామాల్లో నూ ప్రచారం చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ గ్రామస్థులు, స్థానిక నాయకులు పూల వర్షం కురిపిస్తూ, బాణసంచా కాల్చుతూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. తర్వాత కందికుంట ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ప్రజలను కోరారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి , చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. కూటమితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులు సజావుగా జరుగుతాయన్నారు. కూటమి గెలుపునకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సాదులవాండ్లపల్లిలో బోగాదమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, మండలకన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, నాయకులు వెంకటరమణారెడ్డి, కంబయ్య, అక్రమ్, పవన్, దాదాపీర్, ఆనంద్, శ్రీరాములనాయక్, వీరాంజనేయులు, కేశవరెడ్డి, రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: కదిరి మండలం వీరన్నగట్టుపల్లి, ముష్టిపల్లి గ్రామాల్లో కందికుంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీ పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పవన్ కుమార్‌రెడ్డి, గంగయ్యనాయుడు, చెన్నకేశవులు, గంగులప్ప, హరి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వంద కుటుంబాలు చేరిక

నల్లచెరువు: నల్లచెరువు పంచాయతీ కమ్మవారిపల్లి, పులిమివాండ్లపల్లి, పత్రవాండ్లపల్లి, యనుములవారిపల్లి గ్రామాలకు చెందిన వంద కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో దామోదర్‌రెడ్డి, నరేంద్రరావు, మల్లికార్జునరెడ్డి, అశోక్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, కాంతరావు,కృష్ణోజీరావు, రవి, ఆంజనేయులు, అనిల్, సిద్ధోజీరావు, రెడ్డెప్పరావు, బాబురావు, రాంజీరావు, రామచంద్రరావు, మల్లికార్జున, మస్తానప్ప తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ పి.రాజశేఖర్, నాయకులు దాదెం శివారెడ్డి, మాబూసాబ్, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.



నీరుకుంట్లపల్లి కందికుంటకు హారతి పడుతున్న మహిళలు

34వ వార్డులో కందికుంట యశోదాదేవి ప్రచారం

కదిరి: పట్టణంలోని 34వ వార్డు లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కందికుంటను ఎమ్మెల్యేగా , బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రూ. 6.46 లక్షల నగదు పట్టివేత

ముదిగుబ్బ, ఏప్రిల్ 29: మండలంలోని పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టి రూ.6.46 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. వాహన తనిఖీలో కదిరి నుంచి అనంతపురం వైపు వెళుతున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో ఉన్న రఫీ, ఆంజనేయులుకు సంబంధించి1,79,500 రూపాయల నగదు పట్టుబడిందన్నారు. వాటికి రశీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే అదే రూట్లో వెళుతున్న ఐషర్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న కొలేపల్లి అంజి వద్ద 4,66,500 రూపాయల పట్టుపడిందన్నారు. రశీదులు లేనందున స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం రూ. 6,46,000 నగదును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

దళితులపై దాడి హేయం

ధర్మవరం, ఏప్రిల్ 29: రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో ఇటీవల ఎస్సీలపై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సోదరుడు రాజారెడ్డి దౌర్జన్యం చేసి దాడి చేయడం హేయమైన చర్యలని, ఈ ఎన్నికలలో ఓటు ద్వారా వారికి తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు, నాయకులు ఏపీ ముత్యాలు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాప్తాడు నియోజకవర్గంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. అర్ధరాత్రి సమయంలో ఎస్సీల ఇళ్లలోకి చొరబడి దాడులు పాల్పడినా.. పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దౌర్జన్యానికి పాల్పడిన రాజారెడ్డిపై ఎస్సీఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేయాలన్నారు. లేదంటే దళిత సంఘాలు అందరూ కలిసి దండయాత్ర ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీపై సమావేశం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ నాగేశ్వరరావు సామాజిక పింఛన్ల పంపిణీపై పంచాయతీ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా మే 1వ తేదీన ఉదయం 7గంటలకే పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసేలా చూడాలని తెలిపారు. మండలంలో మొత్తం పింఛన్‌దారులు 4,850 మంది ఉండగా.. ఇందులో ఆధార్‌తో అనుసంధానమైన 3,447 మందికి పింఛన్లను వారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. మిగిలిన 1403 మందికి ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్‌దారులకు పింఛన్లను పంపిణీ చేసేలా చూడాలని సూచించారు. పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు రావద్దని ఎంపీడీఓ సూచించారు.

పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లొద్దు

తాడిమర్రి: వచ్చే నెల 1వతేదీన పింఛన్‌దారులు ఎవరూ కూడా పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని ఎంపీడీఓ మణిమంజరి ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారుల ఆధార్‌కార్డుకు బ్యాంకు ఖాతా లింక్ అయిన వారికి, వారి ఖాతాల్లోకి పింఛన్‌సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. అలా రాని వారికి ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. అలాగే విభిన్నప్రతిభావంతులకు 1వతేదీ ఉదయం 8గంటల నుంచి పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. 1వ తేదీ కార్మికదినోత్సవం సందర్భంగా సెలవు కావడం వల్ల 2వ తేదీన బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమైన పింఛన్‌దారులు బ్యాంకుకు వెళ్లి డ్రాచేసుకోవచ్చని పేర్కొన్నారు.

కేతిరెడ్డి ఆటలు ఇక సాగవు: సత్యకుమార్



చేనేతల సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 29: ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆటలు ఇక సాగవని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో సోమవా రం ఆయన చేనేత వ్యా పారులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోని ఎవరైనా చేనేతల జోలికి వస్తే ఖబడ్దార్ అని, వాళ్ల వ్యాపారాలు వాళ్లని చేసుకోనివ్వడమే తమ లక్ష్యమని అన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఐదేళ్ల పాలన దౌర్జన్యాలు, భూదందాలు, సెటిల్మెంట్లతోనే సాగిందన్నారు. ఇక మీ ఆటలు సాగవన్నారు. అనంతరం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ...బీసీ సోదరులంతా ఐక్యతగా ఉండి ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ,టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, బీసీ నాయకులు బోయరవి, జయశ్రీ, గిర్రాజురవి, సాకే ఓబుళేశు, జింకాచంద్ర, చందారాఘవ, జనసేననాయకులు శ్యాంకుమార్ ఉన్నారు.

కనెక్ట్ విత్‌సత్య యాప్ అమల్లోకి

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి అరాచకాలకు, దౌర్జన్యాలకు వారి చేతిలో భూములు పోగొట్టుకున్న బాధితులకు అండగా నిలవడటం కోసం కనెక్ట్ విత్ సత్య అనే యాప్‌ను ప్రవేశపెడుతున్నట్టు సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డుకట్టవేసేందుకు, బాధితులుగా అండగా నిలబడేందుకు ఈ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టామన్నారు. కేతిరెడ్డి కానీ, అతడి అనుచరులు కానీ ఎవరికైనా ఇబ్బంది పెడితే 9408029999కు ఎస్ఎంఎస్ పంపినా, వాట్సప్ మెసేజ్ చేసినా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీజేపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు శేఖర్, సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

సత్యకుమార్ ముమ్మర ప్రచారం

ధర్మవరం: పట్టణంలోని యాదవవీధి,బ్రాహ్మణవీధి, కోటకురుబవీధి,సాయినగర్,తొగట వీధుల్లో సత్యకుమార్, పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే కూటమి ప్రభుత్వం రావాలన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... అవినీతి వైసీపీకి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులను ఆదుకుంటా..

ధర్మవరంరూరల్: అధికారంలోకి వస్తే దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటామని సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని గొట్లూరు రహదారిలో ఉన్న సీఎస్‌బీ గార్డెన్‌లో నియోజకవర్గంలోని దివ్యాంగులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిసెంబర్ 3న తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ధర్మవరం రైల్వేస్టేషన్‌లో దివ్యాంగుల రవాణా కోసం ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సెప్టెంబరు 16న తన జన్మదినం సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు 10ఆటోలు వితరణ చేయనున్నట్లు చెప్పారు. అధికారంలో రాగానే 6వేల ఫించన్‌తో పాటు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ప్రత్యేక భవనాన్ని నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉమ్మర్‌స్టాలిన్, బీజేపీ నాయకులు చంద్ర, ఓబిలేసు, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి 150 కుటుంబాల చేరిక

ముదిగుబ్బ, ఏప్రిల్ 29: మండలంలో పొదరాళ్లపల్లి, పూజారి తండా, రామస్వామి తండా, గురుగుతండాలకు చెందిన 150 కుటుంబాల వారు సోమవారం వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. ఎంపీపీ ఆదినారాయణ ఆధ్వర్యంలో వారు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌ను ధర్మవరంలో కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపట్నుంచి క్రికెట్ ఉచిత శిక్షణ

బత్తలపల్లి, ఏప్రిల్ 29: మండలకేంద్రంలో మే 1 నుంచి 21 వ తేదీ వరకు ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్‌పై ఉచితంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్రికెట్ కోచ్ జయరాం సోమవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో ఉదయం, సాయంకాలం వేలల్లో శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. అవకాశాన్ని 8 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యతను వెలికి తీయడమే ఆర్డీటీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

పుట్టపర్తి అసెంబ్లీ బరిలో 15 మంది..

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. టీడీపీ కూటమి నుంచి పల్లె సింధూరారెడ్డి, వైసీపీ నుంచి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్‌నుంచి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మరో ముగ్గురు ఇతర పార్టీల నుంచి, మరో తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించారు. ఇప్పటికే ప్రధానపార్టీలు ముమ్మరప్రచారంలో ఉండగా స్వతంత్ర అభ్యర్థులు మొదలుపెట్టారు. ప్రచారానికి ఇక 11రోజులు మాత్రమే మిగిలింది.

కదిరి బరిలో 13మంది..

కదిరి: కదిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 13మంది బరిలో నిలిచారు. టీడీపీ కూటమి నుంచి కందికుంట వెంటకప్రసాద్, వైసీపీ నుంచి బీఎస్ మగ్బుల్ బాషా, బీఎస్పీ నుంచి వై. రాంచంద్ర, కాంగ్రెస్ నుంచి కె. షానవ్వాజ్ బరిలో నిలిచారు. ఇక పలువురు స్వతంత్రులు కూడా నిలవగా వారికి గుర్తులు కేటాయించారు.

ధర్మవరం బరిలో 15 మంది..

ధర్మవరం: ధర్మవరం అసెంబ్లీ బరిలో 15 మంది అభ్యర్థులతో పాటు ఒక నోటా బరిలో ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ చేపట్టగా ఎవరూ ఉపసంహరించుకోలేదన్నారు. దీంతో బీజేపీ తరఫున సత్యకుమార్‌యాదవ్, వైసీపీ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ తరఫున రంగన అశ్వర్ధనారాయణ, బీఎస్పీ తరఫున సాకే వినయ్‌కుమార్, జై భీమ్‌రామ్ భారత్ పార్టీ తరఫున దారా శంకర్, నవతరం పార్టీ తరఫున షేక్ ఆయాజ్ బరిలో నిలిచారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఇలియాజ్ అహమ్మద్ సయ్యద్, ఈశ్వర్‌రెడ్డి మాచిరెడ్డి, జోగన్నగారి సూర్యనారాయణ, దాసరికవిత, ఎం.ధనంజయ, బిల్లేనరేంద్ర, బీరే సోమశేఖర్, రవీంద్రరెడ్డి, డి.శ్రీనివాసులునాయక్‌లు బరిలో ఉన్నట్లు అధికారి తెలిపారు.

కరణం హరికృష్ణ సస్పెన్షన్‌ను ఎత్తేయాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 29: తన అభిప్రాయం చెప్పినందుకు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణను సస్పెన్షన్ చేయడం సరికాదని అసోసియేషన్ నాయకులు పెద్దన్న, పిడుగు శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనన్నారు. మానవహక్కుల ఉల్లంఘన కిందికీ వస్తుందన్నారు. హరికృష్ణ జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియదని, ఉపాధ్యాయులు యాప్‌ల భారంతో ఇబ్బంది పడుతున్నారని తన అభిప్రాయాన్ని మాత్రమే చెప్పారన్నారు. అంతేగానీ ఎవరికీ అనుకూలంగాకానీ, వ్యతిరేకంగా కానీ మాట్లాడలేదన్నారు. దీనికే అతన్ని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలోకి చేరిన వారితో పల్లె సింధూర



పల్లె సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

కొత్తచెరువు, ఏప్రిల్ 29: పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో మండలంలోని తిప్పాబట్లపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సింధూరారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లుగా అరాచక పాలన సాగించిన వైసీపీని ఇంటికి సాగనంపుదామని అన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా కష్టపడాలని సూచించారు. టీడీపీలోకి చేరిన వారిలో మాదినేని వెంకటనారాయణ, ఇరగంపల్లి ఉపసర్పంచ్ శ్రీరాములు, వలంటీర్ ప్రణీత, మాజీ సర్పంచ్ నిర్మల, శ్రీధర్, కిరణ్, శ్రీనివాసులు, జయరాంనాయుడు, వెంకటరాముడు, శీన, వెంక టాచలం, గోపాల్‌నాయక్, హరీశ్, మధుసూదన్, తిప్పానాయక్, శ్రీనాథ్, నాగరత్నమ్మ, రామచంద్ర, జానకమ్మ, బాలక్రిష్ణ, మహేశ్, శారద, జయరాం నాయక్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పుట్టపర్తి రూరల్: మండలంలోని వెంగళమ్మచెరువు, వీరజిన్నయ్యపల్లి చెర్లోపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. తర్వాత ఆగ్రామాలకు చెందిన వంద కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి పల్లె సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో వీరజిన్నయ్యపల్లి మాజీసర్పంచు రామకృష్ణమ్మ, నారాయణ, రామయ్య, దాసప్ప, లింగట్లవిక్రం, గంథమనేని ఆనంద్‌కుమార్, ఇడగుట్టు ప్రభాకర్, పల్లపుశివ, ఎం వెంకటన్న, ఎల్ రామయ్య, ఈ రంగ, చంద్రశేఖర్, మహేంద్ర, లక్ష్మినారాయణ, శ్రీరాములు, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ విజయ్ కుమార్, నాయకులు ఆదినారాయణరెడ్డి శ్రీరామరెడ్డి, పీసీ గంగన్న, సిమెంట్ పోలన్న, కేశవ, ఊరువాకిలి సూరి, పుల్లప్ప , దేవేంద్ర, జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్, తెలుగు యువత నాయకులు రామ్‌లక్ష్మణ్‌లు,బీజేపీ నాయకులు కొండమరాజు, జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నను సీఎం చేసుకుందాం

ఓబుళదేవరచెరువు: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని, అందుకు అందరూ కృషి చేయాలని టీడీపీ యువనాయకుడు పల్లె వెంకటకృష్ణకిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కుసుమవారిపల్లి, దిగువపల్లి, మామిళ్లకుంట్లపల్లి, ఎం.కొత్తపల్లి తదితర గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు పరుస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు జెరిపి టి ఆంజనప్ప, నాయకులు జయరామిరెడ్డి, జాకీ ర్, బడిశం రామాంజి, జెరిపిటి ప్రసాద్, వైదేహి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు దిగితే ఈసీకి ఫిర్యాదు చేస్తాం: పల్లె

కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి మద్దతుగా యువనేత పల్లె వెంకటకృష్ణకిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తుంటే వైసీపీ నాయకులు వారి ప్రచార రథాన్ని అడ్డుపెట్టి కవ్వింపు చర్యలకు దిగడం సరికాదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. కుసుమవారిపల్లిలో జరిగిన వివాదంపై పల్లె స్పందించి ఫోన్ ద్వారా మాట్లాడారు. వైసీపీ వారు కవ్వింపుల చర్యలకు దిగుడంతోనే వివాదం జరిగిందన్నారు. టీడీపీ కార్యకర్తలను ఏకపక్షంగా పోలీసులు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. అలాగే వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

నల్లమాడ, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని గంగాథియేటర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్‌పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు పథకాల గురించి వివరించారు. వాటి వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం కాగానే ఈ పథకాలను అమలు చేస్తారని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణం నాయుడు, మైలే రామచంద్ర, రహంతుల్లా, మహేష్, పాపారాయుడు, శ్రీరాములు, అగ్గిరాముడు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలకేంద్రంలో టీడీపీ నేత మాణిక్యం బాబా ముస్లిం సోదరులతో గాంధీనగర్, పాత తహసీల్దార్ కార్యాలయం వీధుల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. అలాగే ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అంతకుమునుపు సింధూరరెడ్డి విజయం సాధించాలని స్థానిక దర్గాలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బత్తలపలి,: మండలంలోని గరిశనపల్లి, నెత్తువారంపల్లి , జలాలపురం గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకుడు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. చంద్రబాబు సీఎం అయితే వాటిని అమలు చేస్తారన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ప్రజల్ని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

తనకల్లు, ఏప్రిల్ 29: మండలంలోని కొట్టువారి పల్లిలో తాగునీటి సమస్య తీర్చాలంటూ ఆ గ్రామానికి చెందిన మహిళలు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామంలో గత మూడునెలలుగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. గుక్కెడు నీరు లభించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో బోరులో నీరు పుష్కలంగా ఉన్నాయని, అయితే పంచాయతీ అధికారులు విద్యుత్ మోటారు అమర్చలేదని, దీంతో సమస్య నెలకొందని వాపోయారు. సమస్యను పలుమార్లు విన్నవించినా పంచాయతీ అధికారులు స్పందించలేదని తెలిపారు. సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదని భీష్మించారు. అధికారులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కృష్ణారెడ్డి ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు వచ్చి రెండురోజులలోపు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నెలరోజులుగా ఇదే విషయం చెబుతున్నారని, సమస్య పరిష్కారం కాలేదని మహిళలు మండిపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కవిత వచ్చి ప్రతిరోజు రెండు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. చివరకు అధికారులు నచ్చ చెప్పి ఆందోళన విరమింప చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని గాండ్లవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణ ముదిగుబ్బ నుంచి ఆటో నడుపుకుంటూ స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

సపోటా తోటకు గుర్తుతెలియని వ్యక్తుల నిప్పు

- 688 చెట్లు దగ్ధం

కొత్తచెరువు, ఏప్రిల్ 29:మండలంలోని వేములేటిపల్లి గ్రామసమీపంలో రైతు గండికోట ఆంజనేయులు ఐదెకరాలలో సాగు చేసిన సపోటా తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి చెట్లన్నీ కాలిపోయాయి. ఘటనపై బాధిత రైతు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకున్న 5.45 ఎకరాలలో 688 సపోటా చెట్లను పదేళ్ల క్రితం సాగుచేశానన్నారు. అయితే సోమవారం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కంచెకు నిప్పుపెట్టడంతో మంటలు తోటకు వ్యాపించి చెట్లన్నీ కాలిపోయాయని తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే డ్రిప్ పరికరాలతో పాటు కోతకు వచ్చిన చెట్లన్నీ కాలిపోయాయన్నారు. దీంతో రూ.10లక్షల దాకా నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.



కాలిపోయిన సపోటా చెట్లను చూపుతున్నరైతు

నేడు నల్లచెరువులో కందికుంట ఎన్నికల ప్రచారం

నల్లచెరువు, ఏప్రిల్ 29: నల్లచెరువు పంచాయతీలోని గ్రామాల్లో మంగళవారం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు మండలకేంద్రంలో ప్రచారం మొదలవుతుందన్నారు. కూటమి శ్రేణులు పాల్గొన్నాలన్నారు.

ముదిగుబ్బ మండలంలో సత్యకుమార్..

ముదిగుబ్బ: మండలంలోని చిన్నకోట్ల, ఎర్రగుంటపల్లి, రామవంపల్లి, మొగలచెట్లపల్లి, బూదనంపల్లి, చిత్రవాండ్లపల్లి, కొడవాండ్లపల్లి, ఈదులపల్లి, రంగాపురం, గంగిరెడ్డిపల్లి, బ్రహ్మదేవరమర్రి, హుస్సేన్‌పురం, పీసీరేవు, ఉప్పలపాడు, సిద్దనగారిపల్లి, రాళ్ళఅనంతపురం, జొన్నలకొత్తపల్లి, గుంజేపల్లి, ముక్తాపురం, నలాయకుంటపల్లి, యాకర్లకుంటపల్లి, నల్లచెర్లోపల్లి గ్రామాలలో మంగళవారం కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారని కూటమి మండల నాయకులు తెలిపారు. కూటమి పార్టీల శ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

చారుపల్లిలో పల్లె కృష్ణకిశోర్‌రెడ్డి..

నల్లమాడ: మండలంలోని చారుపల్లి, దొన్నికోట పంచాయతీలో మంగళవారం కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి మద్దతుగా యువనాయకుడు పల్లె వెంకటక్రిష్ణకిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మండల కన్వీనర్ మైలే శివశంకర్‌తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

27 మందికి కుట్టుమిషన్ల పంపిణీ

కొత్తచెరువు, ఏప్రిల్29: మండలకేంద్రంలోని పీఆర్‌డీఎస్ కార్యాలయంలో సోమవారం 27 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్లు పీఆర్‌డీఎస్ నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జర్మనీ దేశానికి చెందిన సత్యసాయి బాబా భక్తురాలు మల్లర్‌హన్నాటాస్టిఫ్టంగ్ సహకారంతో ఈ కుట్టు మిషన్లను పేద మహిళలకు అందజేశామన్నారు. వారికి కుట్టుమిషన్ శిక్షణ కూడా ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్న ఉద్దేశ్యంతో రూ.10వేలు వడ్డీ లేని రుణాన్ని అందజేశామన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక


ధర్మవరం, ఏప్రిల్ 29: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన 10 కుటుంబాల వారు వైసీపీ వీడి టీడీపీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వారు నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అధికారంలోకి రాగానే అందరికీ తగిన గుర్తింపు ఇస్తామన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి

ధర్మవరంరూరల్, ఏప్రిల్29: మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామంలో చేపలగుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామానికి చెందిన ఎరికలసురేష్(40) వెంకటతిమ్మాపురంలో మంగళవారం జరిగే జ్యోతులబోనాల కార్యక్రమానికి వెంకటరమణ అనే బంధువు ఇంటికి వచ్చాడు. సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న చేపల గుంత వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారిపడి గుంతలో పడ్డాడు. అందులో నీరు అధికంగా ఉండటంతో పాటు పాచి ఎక్కువగా ఉండటంతో బయటకు రాలేక ఊపిరాడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హుటాహుటినా ఘటనాస్థలికి వెళ్లి సురేష్‌ను బయటకు తీసి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఎరికల సురేష్(ఫైల్)

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు: సీపీఐ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29: మండల తహసీల్దార్ ఖాజీబీ రైతులను ఇబ్బందులు పెడుతోందని, ఇది తగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాక్‌లో ఉన్న వన్‌బీ అడంగల్‌ను తొలగించాలని కోరుతూ రైతులు తహసీల్దార్‌కు గత పదిరోజు క్రితం వినతిపత్రం సమర్పించారని, అయినా ఆమె పట్టించుకోలేదని, రోజూ రైతులను కార్యాలయం చుట్టు తిప్పుకుని ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చామని, ఏ పనులు చేయమనే వ్యవహరిస్తోందని ఆరోపించారు. తహసీల్దార్ తీరు మార్చుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

టీడీపీ మడకశిర ఎన్నికల సమన్వయకర్తగా గుండుమల



పుట్టపర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మడకశిర నియోజక వర్గం ఎన్నికల సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని నియమించారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా రాప్తాడు నియోజక వర్గం సమన్వయకర్తగా గోనుగుంట్ల విజయ్‌కుమార్‌ను నియమించారు.

రెడ్డిచెరువుపల్లి వలంటీర్ తొలగింపు

గోరంట్ల, ఏప్రిల్ 29: మండలంలోని నారసింహపల్లి సచివాలయం పరిధిలోని రెడ్డిచెరువుపల్లి పంచాయతీలోని 16వ క్లస్టర్ గ్రామ వలంటీర్ జంగాల అనితను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ అనిత వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈ విషయమై అధికారులు ఆమెకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. అయితే ఆమె వాటికి సమాధానం తెలుపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు. రెడ్డిచెరువుపల్లికి చెందిన వలంటీర్ రమ్య మంత్రి ఉషశ్రీచరణ్‌తో సెల్ఫీ దిగి ఫోన్ స్టేటస్‌లో పెట్టడంతో ఆమెను తొలగించిన విషయం తెలిసిందే. కాగా మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన 14మంది వలంటీర్లు విధులకు సోమవారం రాజీనామా చేస్తూ ఎంపీడీఓ కార్యాలయంలో పత్రాలు సమర్పించారు. మండలవ్యాప్తంగా 443మంది వలంటీర్లు పనిచేస్తుండగా, ఇప్పటివరకు 308మంది విధుల నుంచి వైదొలగినట్లు అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు

- ఎంపీడీఓ

గోరంట్ల, ఏప్రిల్ 29: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 11,617మందికి సకాలంలో పింఛన్లు అదించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా 8,844మంది పింఛన్ దారులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి రూ.2,65,32వేలు జమ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మిగిలిన 2,773మందికి సచివాలయ సిబ్బంది ద్వారా రూ.80,31,500ను వారి ఇళ్లవద్ద అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. బ్యాంక్‌లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పింఛన్‌దారులకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. పింఛన్ వివరాలు సచివాయాల్లో నోటీసు బోర్డు ద్వారా, దండోరా ద్వారా ప్రజలకు తెలుపుతున్నామన్నారు.

పెనుకొండ రూరల్ : మండలంలోని 1993మంది వృద్ధులకు బుధవారం సచివాలయ ఉద్యోగులు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీచేయనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 7484మంది పింఛన్లు ఉండగా 5491మందికి నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోకి పింఛన్ జమ అవుతుందన్నారు. మిగిలిన 1993మందికి బుధవారం సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకే తెచ్చి అందిస్తారన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 29: పట్టణంలోని మూడో వార్డులో నివాసముంటున్న సుకన్య అనే మహిళ కుటుంబ కలహాలతో సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చంద్రశేఖర్, సుకన్య దంపతులు మూడో రోడ్డులో నివాసముంటున్నారు. విషద్రావకం తాగి అస్వస్థతకు గురైన సుకన్యను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

గోరంట్లలో విశాఖవాసి ఆత్మహత్య


మీసాల ఉపేంద్ర (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 29: స్థానిక సొసైటీ వీధిలో విశాఖపట్నానికి చెందిన మీసాల ఉపేంద్ర (22) సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖపట్నంలోని తాళ్లవలస బెస్తపేటకు చెందిన మీసాల సూర్యనారాయణ కుమారుడు ఉపేంద్ర పెనుకొండ సమీపంలోని కియ అనుబంధ ఎస్ఎల్‌పీపీ పరిశ్రమలో రెండున్నరేళ్లగా పని చేస్తుండేవాడు. తోటి ఉద్యోగి దామోదర్‌తో కలిసి గోరంట్లలోని సొసైటీ వీధిలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున ఉపేంద్ర బాత్‌రూమ్‌లోకి వెళ్లి పైకప్పునకు తాడుతో ఉరేసుకుని, మరణించాడు. కాసేపటికి నిద్రలేచిన దామోదర్.. ఉపేంద్ర బాత్‌రూమ్ నుంచి ఎంతసేపటికీ రాకపోవడంతో కిటికీలో నుంచి చూశాడు. ఉరికి వేలాడుతుండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, ఉపేంద్ర కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని, శవాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. విశాఖ నుంచి కుటుంబ సభ్యులు వస్తే.. వివరాలు తెలుస్తాయని ఆయన వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రొద్దం, ఏప్రిల్ 29: మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన బోయ ప్రహ్లాద్(43)అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామ సమీపంలోని చింతతోపులో విగతజీవుడిగా పడిఉన్న వ్యక్తిని సోమవారం గ్రామస్థులు చూసి పోలీసులకు, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆదివారం రాత్రే మృతిచెందాడని, అయితే అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. మృతుడి భార్య రెండేళ్ల కిందట మృతిచెందింది. ఒక కుమార్తె ఉంది. భార్య మృతితో అతడు మద్యానికి బానిసయ్యాడు. అయితే తప్పతాగి చింతతోపులో ఆదివారం రాత్రి మృతిచెంది ఉంటాడని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. చెవివద్ద చిన్న రక్త గాయం ఉండటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు

- సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి

మడకశిర రూరల్, ఏప్రిల్ 29: మండలంలోని సరిహద్దు గ్రామాల్లోకి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు. మండలపరిధిలోని వైబీ హళ్లి గ్రామంలో సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న ఓ మహిళ నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు ఆమె పై నమోదు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


పెద్దిరెడ్డిపల్లి గేటులో సవితకు హారతి ఇస్తున్న మహిళలు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీల సంక్షేమమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె సోమవారం ఉదయం పెనుకొండ పట్టణం దర్గాపేటలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో సూపర్‌సిక్స్ పథకాలు, మైనార్టీలకు గతంలో ఉన్న సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబును అరెస్ట్‌చేసినప్పుడు మైనార్టీలు రోడ్లపై తెలిపిన నిరసనతోనే జగన్ పాలనపై వారికి ఎంత వ్యతిరేక ఉందో అర్థం అవుతుందన్నారు. ఈ ప్రభుత్వం ముస్లింల ద్రోహి అన్నారు. రూ.కోట్ల ముస్లిం సంక్షేమ నిధులను జగన్ సొంత కార్యక్రమాలకు వాడుకున్నాడన్నారు. ఈ ఐదేళ్ల మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి పార్థసారథికి ఓటేసి గెలి పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు షౌకత్, గుట్టూరు సూరి, దాదు, షమున్, జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: టీడీపీ కూటమి అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో శివాలయం కాలనీలోని పవర్‌లుమ్స్ నిర్వాకులు కట్టా నారాయణ, కట్టా రామచంద్ర, పాండు కుటుంబ సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. సవిత గోరంట్లలోని వారి నివాసానికెళ్లి వారి అభ్యర్థన మేరకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే సవిత భర్త వెంకటేశ్వర్లు, ఆమె సోదరుడు రవికుమార్, కుటుంబ సభ్యులు సుభద్ర, మాధవి స్థానిక నాయకులతో జట్లుగా ఏర్పడి నాలుగు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. వారితో పాటు మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, కన్వీనర్ సోముశేఖర్, నాయకులు లక్ష్మి, నాగరాజు, ఆదిలక్ష్మి, గిరి, వెణుగోపాల్, అజంతుల్లా, కక్కల రఘు, ఉమ్మర్‌ఖాన్, జనసేన, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

హిందూపురం అర్బన్: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సోమవారం పరిగి మండల పరిధిలోని పుట్టగూర్లపల్లి, మోదా, కోనాపురం, పెద్దరెడ్డిపల్లి, కొడిగెనహళ్ళి, సుబ్బరాయునిపల్లి, కాలువపల్లి, పరిగి, బోరెడ్డిపల్లి, చిన్నపల్లిలో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రతి గ్రామంలో ఆమెకు బ్రహ్మరథంపట్టారు. మహిళలు హారతులతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుట్టగూర్లపల్లిలో టీఎన్ నరసింహప్ప టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ధనాపురం సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కాలవపల్లి సత్యనారాయణ, నాయకులు సోమప్ప, పరిగి హనుమయ్య, ఈశ్వరయ్య, నారాయణ రెడ్డి, చెన్నక్రిష్టారెడ్డి గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మోదశివ, ప్రవీన్‌రెడ్డి, శ్రీరాములు, కిష్టప్ప, తిప్పారెడ్డి, రామాంజినేయులు తదితరులు హాజరయ్యారు. అలాగే ఆమె పరిగి మండలంలోని నిషా గార్మెంట్స్‌లో మహిళా కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.


గోరంట్లలో సవిత కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం

మూడోసారీ అవకాశం ఇవ్వండి

- పురాన్ని ఆదర్శంగా నిలుపుతాం
- ఎన్నికల ప్రచారంలో వసుంధరాదేవి


దివ్యాంగుడితో మాట్లాడుతున్న వసుంధరాదేవి

హిందూపురం, ఏప్రిల్ 29: హిందూపురం అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో ఉన్న నందమూరి బాలకృష్ణను మూడోసారి గెలిపిస్తే ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నందమూరి వసుంధరా దేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె సోమవారం శ్రీకంఠపురం, డీబీ కాలనీ, డీఆర్ కాలనీ, నానెప్పనగర్, లక్ష్మీపురం, పులమతిరోడ్డు, మోడల్‌కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వసుందరాదేవి మాట్లాడుతూ... బాలకృష్ణ ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తుంటాడన్నారు. ఆయన విదేశా ల్లో ఉన్నా రోజూ హిందూపురం ని యోజకవర్గ పరిస్థితులపై తెలుసు కుంటూ ఉంటారన్నారు. గత టీడీపీ హయాంలో ఎంత అభివృద్ధి చేశారో మీరే చూశారని, ఈసారి గెలిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తారన్నారు. రాష్ట్రంలో కూటమి, కేం ద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని టీడీపీ, బీజేపీ, జనసేన కూట మిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, మాజీ చైర్మన్ అనిల్ కుమార్, పట్టణాధ్యక్షుడు ర మేష్, కౌన్సిలర్ మంజుల, టీడీపీ నాయకులు నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, మంగేష్, బీజేపీ నాయకులు ఆదర్శ్, జనసేన ఉమేష్, ప్రెస్ వెంకటేష్, కదిరప్ప, పరిమళ, నవీన్, అంజి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్ : గతంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరి కౌన్సిలర్‌గా గెలుపొందిన 27వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రమ్మ తిరిగి సోమవారం టీడీపీ లోకి చేరారు. ఆమెకు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుందరాదేవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... బడుగు బలహీనవర్గాలకు టీడీపీనే అండగా ఉంటుందన్నారు. చంద్రబాబు, నందమూరి బాలకృష్ణ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు హిందూపురం అభివృద్ధి చెందుతుందని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డు ఇన్‌చార్జ్ శశికళ, జయసింహ, బూత్‌ఇన్‌చార్జ్ గణేష్, రవి, నాగార్జున, పట్టణాధ్యక్షుడు రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర, ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.


వసుందరాదేవి సమక్షంలో టీడీపీలో చేరిన కౌన్సిలర్ నాగేంద్రమ్మ

శాంతియుతంగానే ఓట్లు అడుగుతున్నాం

టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి


ప్రచారంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

గుడిబండ, ఏప్రిల్ 29 : ప్రశాంతంగా ఉన్న మడకశిర నియోజకవర్గంలో శాంతియుతంగానే ఎన్నికల ప్రచారం సాగిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నామని టీడీపీ పురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలిసి సోమవారం గుడిబండ మండలంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గంలో కత్తులు పట్టి, రౌడీయిజం చేస్తూ టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని సీఎం జగన్ సొంత పత్రిక, చానల్‌లో వస్తున్న కథనాలపై స్పందించారు. కత్తులు, కటారాలు చూపి ప్రజలను భయభ్రాంతులు చేసి ఓటు వేయించుకున్న ఘనత సీఎం జగన్, వారి తాత రాజారెడ్డి, తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. వారిలాగా తాము రౌడీయిజం చేసి రాజకీయం చేయలేమన్నారు. వజ్రాయుధం లాంటి ఓటును సైకిల్‌గుర్తుకు వేయాలని ప్రశాంతంగానే ప్రజలను కోరుతున్నామన్నారు. ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపుతుండటం చూసి ఓర్వలేక టీడీపీ నాయకులపై అసత్యఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు లక్ష్మీనరసప్ప, దుర్గేష్, రాజు, మంజునాథ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంటికే..!

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి


పోలింగ్ కేంద్రాల్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

హిందూపురం, ఏప్రిల్ 29: ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండా లని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఆయన సోమ వారం హిందూ పు రం వద్ద ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ పో లింగ్, కౌంటింగ్ కేంద్రాలను డీఎస్పీ కంజక్షన్, సీఐలతో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలతోపాటు పోలీసులు నిరంతరం అప్రమ త్తంగా ఉండాలన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంటికిపో తారని హెచ్చరించారు. బిట్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం, ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్, రహమత్‌పురం, కొట్నూరు, ఎంజీఎంలో పోలింగ్ కేం ద్రాలను పరిశీలించారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చా రు. కార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీతోపాటు సీఐలు శ్రీనివాసులు, రియాజ్‌అహ్మద్, ఈరన్న, వై శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చులు సక్రమంగా నమోదు చేయండి

పరిశీలకుడు వినాయకన్

పెనుకొండ, ఏప్రిల్ 29 : ఎన్నికల్లో పోటీచేసిన ప్రతి అభ్యర్థి నామినేషన్ వేసిన తేది నుంచి ఫలితాలు వెలువడేవరకు ఎన్నికల ఖర్చులకు సంబంధించి సరైన ఖాతాను నిర్వహించి ఎన్నికల అధికారికి అప్పగించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వినాయకన్ పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థి రూ.40లక్షలకు మించి ఎన్నికల ఖర్చు చేయకూడదన్నారు. ఎన్నికల ఖర్చులు సక్రమంగా చెల్లించకపోతే ఆర్పీ చట్టం 1951లోని సెక్షన్ ఐఓఏ ప్రకారం ఎన్నికల కమిషన్ మూడేళ్లపాటు అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ప్రతి అభ్యర్థి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి తనకు ఇచ్చిన రిజిస్టరులోని తన ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతాను నిర్వహించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్, మోడల్ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు



అంగన్‌వాడీ కేంద్రంలో చెడిపోయిన కోడిగుడ్లు, నాణ్యమైన కోడిగుడ్లను అందిస్తున్న దృశ్యం

పావగడ, ఏప్రిల్ 29: తాలూకాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాశిరకంగా ఉన్న కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని, అవి కొద్ది రోజులకే చెడిపోయి వాటిని తిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని భారతీయ పరివర్తన సంఘం జిల్లా అధ్యక్షుడు కెంచరాయ ఆరోపించారు. నిడిగల్లు హోబళిలోని తూమకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన కోడిగుడ్లలో కుళ్లిపోయిన కోడిగుడ్లు ఉండటం వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో సీడీపీఓ సునీతకు సమాచారం అందించగా ఆమె సంబంధిత అంగన్‌వాడీ కేంద్రానికి సూచనలు ఇచ్చి నాణ్యమైన కోడిగుడ్లను అందించడానికి కృషి చేశారు. తక్కువ ధరలకే నాశిరకం కోడిగుడ్లు దొరుకుతుండటం వల్ల కాంట్రాక్టర్లు ఒప్పందం ఏర్పరచుకొని ఈఅక్రమ వ్యవహారానికి పాల్పడుతున్నారని కెంచరాయ ఆరోపించారు. వెంటనే స్పందించిన ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి నాణ్యమైన గుడ్లను కృషి చేసిన సీడీపీఓ సునీతకు భారతీయ పరివర్తన సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఓకే..!

దిగివచ్చిన ఎస్కేయూ యాజమాన్యం


సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఆమోదాన్ని అందజేస్తున్న కమిటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29: డిగ్రీలో సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్కేయూ యాజమాన్యం నిర్ణయించింది. దీంతో పరీక్షల కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న విద్యార్థులకు ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సప్లిమెంటరీ పరీక్షలకు కొర్రీలు పెడుతూ వచ్చింది. దీంతో డిగ్రీ విద్యార్థులు ఫెయిల్ అయిన ఎస్కేయూ విద్యార్థులు సబ్జెక్టులను పూర్తిచేసుకోలేకపోయారు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పటి వీసీ రామకృష్ణారెడ్డి తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఆయన వైసీపీ నాయకుడి తరహాలో వ్యవహరిస్తున్నారని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు సైతం నిర్వహించాయి. అయినా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేది లేదని ఆయన మొండికేశారు. ఆ తరువాత ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుధాకర్ దృష్టికి ఈ సమస్యను కళాశాలల యాజమాన్యాలు తీసుకువెళ్లాయి. ఆయన స్పందించి, పరీక్షల నిర్వహణ దిశగా అడుగులువేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బాధిత విద్యార్థుల ప్రభావం ఉంటుందని భావించిన వైసీపీ ప్రభుత్వం.. పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు. వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ అధ్యక్షతన సోమవారం ముఖ్య సమావేశాన్ని నిర్వహించి, ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 1994-95 నుంచి 2014-15 బ్యాచ్‌ల విద్యార్థులకు సంవత్సర పరీక్షలు, 2015-16 నుంచి 2018-19 బ్యాచ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు కమిటీ ఆమోదం తెలిపిందని వీసీ వెల్లడించారు. బీఏ, బీకామ్, బీఎస్సీ బీసీఏ, బీబీఏతోపాటు ఇతర కోర్సులలో సబ్జెక్టులు మిగిలిపోయిన వారందరికీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సంవత్సర పరీక్షల విద్యార్థులకు ఆఫ్‌లైన్, సెమిస్టర్ పరీక్షల విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులు తాము చదివిన కాలేజీలలోగాని, యూనివర్సిటీలోగాని దరఖాస్తులను అందజేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. కమిటీ సభ్యులు రామగోపాల్, రామకృష్ణ, జయరామిరెడ్డి, సీఈ శ్రీరాములు నాయక్ సమావేశంలో పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్డీ

మడకశిరటౌన్, ఏప్రిల్ 29: పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ నాగలింగారెడ్డి సందర్శించారు. కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. అధ్యాపకుల హాజరుపట్టిక, అధ్యాపకుల వ్యక్తిగత రికార్డులను, కార్యకలాపాల రికార్డులను పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్యను బోధించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

గడ్డి కేంద్రాన్ని పరిశీలించిన డీసీ

పావగడ, ఏప్రిల్ 29: తాలూకా పరిధిలోని నాగలమడక గ్రామంలో నెలకొల్పిన పశుగ్రాస కేంద్రాన్ని తుమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి సోమవారం పరిశీలించారు. గడ్డిని కొనుగోలు చేయడానికి వచ్చిన రైతులతో గడ్డి విక్రయం మరియు అధికారుల తీరుపై ఆమె అడిగి తెలుసుకొన్నారు. ఒక్క రోజుకు ఒక పశువుకు ఆరు కిలోల తరపున వారానికి 42 కిలోల గడ్డిని రూ.2 సబ్సిడీ తరపున అందజేస్తున్నట్లు డీసీ రైతులకు తెలియజేశారు. అనంతరం గడ్డి కేంద్రాల వద్ద నీటి సౌకర్యం, అగ్నిమాపక సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని, పావగడలోని చాకలికుంటకు పైప్‌లైన్ ద్వారా నాగలమడక నుండి తరలించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఆమె తెలిపారు. తుంగభద్రా నీరు ఇప్పటికే పావగడ దగ్గరలో నిల్వ ఉంచామని, పావగడకు తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

పురం బరిలో 13మంది

హిందూపురం, ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. నామినేషన్ ఉపసంహరణకు మధ్యాహ్నం 3గంటల వరకు సమయం ఉన్నా ఒక్కరు కూడా ఉపసంహరించుకోలేదు. దీంతో హిందూపురం అసెంబ్లీ బరిలో 13మంది నిలిచారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు 8మంది ఉండగా స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు ఉన్నారు. ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులతో వివరాలు ఇలా ఉన్నాయి. ఎంహెచ్ ఇనాయతుల్లా (కాంగ్రెస్ - హస్తం), టీఎన్ దీపిక (వైసీపీ - సీలింగ్ ఫ్యాన్), నందమూరి బాలకృష్ణ (టీడీపీ - సైకిల్), ఎం శ్రీరాములు (బీఎస్పీ - ఏనుగు), కె నౌషాద్ (ఏపీ రాష్ట్రసమితి - గ్యాస్ సిలిండర్), జీ నాగరాజు(జైభీమ్‌రావు భారత్ - కోటు) వి రవీంద్ర (ఎస్‌యూసీఐ - బ్యాట్), షేక్ షౌకత్ (సమాజ్‌వాది పార్టీ - సైకిల్ పంపు)తో పాటు ఐదుగురు స్వతంత్రులు బరిలో నిలిచారు.

పెనుకొండలో తొమ్మిది మంది...

పెనుకొండ : స్థానిక అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేసిన పది మందిలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోగా తొమ్మిది మంది బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు చివరి రోజు సోమవారం స్వతంత్ర అభ్యర్థి జీ నరేంద్ర తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారికి ధ్రువీకరణపత్రం అందించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తరువాత తొమ్మిదిమంది బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ తెలిపారు. అందులో టీడీపీ అభ్యర్థి సవిత, వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్, బీఎస్పీ - ఆదినారాయణ, జైభీమ్‌రావు పార్టీ - నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ - నరసింహులుతోపాటు స్వతంత్ర అభ్యర్థులు నలుగురులు బరిలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్తులు కేటాయించారు.

మడకశిర బరిలో 13 మంది...

మడకశిరటౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మడకశిర నియోజకవర్గానికి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఆర్ఓ గౌరీ శంకర్ తెలిపారు. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు సోమవారం ముగ్గురు ఉపసంహరించుకోగా బరిలో నిలిచిన 13 మంది అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ (ఎంఎస్ రాజు - సైకిల్), వైసీపీ (ఈర లక్కప్ప- ఫ్యాన్), కాంగ్రెస్ పార్టీ (కె సుధాకర్ - హస్తం), బీఎస్పీ (ఇందివర్ - ఏనుగు), రాడికల్‌పార్టీ ఆఫ్ ఇండియా (హను మంత రాజు -ఉంగరం)తో పాటు ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. వారికి ఎన్నికల అధికారి గుర్తులు కేటాయించారు.

డాక్టర్‌కు స్టెతస్కోపు గుర్తు

హిందూపురం, ఏప్రిల్ 29 : పట్టణంలో ప్రస్తుతం ప్రైవేట్ వైద్యుడిగా పనిచేస్తున్న జీ లోకేంద్రనాథ్ స్థానిక అసెం బ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే ఆయనకు గుర్తు కేటాయింపు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనకు సోమవారం నామినేషన్ ఉపసంహరణ గడువు ముగియడంతో వరుస సంఖ్యలో స్టెత స్కోపు గుర్తు ఇచ్చారు. వైద్యుడికి స్టెతస్కోపు గుర్తు రావడంతో ఆ యన ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఈ గుర్తుచూసిన వారంతా నివ్వెర పోయారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 29 : పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందిస్తామని టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారంలో తెలియజేశారు. వారు సోమవారం రొద్దం మండలంలోని కే మరువపల్లి, కలిపి, శేషాపురం, బూదిపల్లిల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీ పీ నాయకులు మాధవనాయుడు, నరసింహులు, చిన్నప్పయ్య, చం ద్రమౌళి, నరహరి, అరుణ్‌రెడ్డి, మారుతిరెడ్డి, హరీష్, తిరుపాల్ నాయుడు, మనోహర్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని కాకి పంచాయతీ పరిధిలోని అప్పేపల్లిలో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథికి మద్దతుగా స్థానిక నాయకులు దాసిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఈరన్న, మాజీ ఎంపీపీ కిష్టప్ప, గుడ్డగుర్కి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దొడ్డేరి పంచాయతీలో ప్రచారం

దొడ్డేరి పంచాయతీలో మంగళవారం టీడీపీ మద్దతుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు మండల కన్వీనర్ దాసిరెడ్డి తెలిపారు.

మడకశిర రూరల్: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ గెలవాలని ఆ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని మెళవాయి పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్

లేపాక్షి, ఏప్రిల్ 29 : ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులోంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను సోమవారం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మండలపరిధిలోని గలిబిపల్లి - ఉప్పరపల్లి చెరువు నుంచి నాలుగు ట్రాక్టర్లు, జేసీబీతో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ గోపి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌పే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌పై కేసు నమోదుచేసి అపరాధ రుసుము విధించి వాహనాలను వదిలేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఇదే చెరువు నుంచి 15రోజుల నుంచి కొంతమంది లేఅవుట్లకు రియల్ వ్యాపారులు రాత్రి సమ యంలో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. అయితే దానిని సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, అయితే ఒక రైతు తన పొలానికి ట్రాక్టర్లలో మట్టిని తోలగానే వెంటనే అదుపులోకి తీసుకోవడం ఏమిటని పోలీసుల తీరుపై మండల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లేఅవుట్లకు మట్టితోలిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 29: సోమందేపల్లి సర్వేనంబరు 700లో మూడు నెలలనుంచి 150గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమకు ఇళ్ల పట్టాలు అందించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్లు లేని నిరుపేదలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టి వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడు సబ్ కలెక్టర్ అయినా పట్టించుకోవాలన్నారు. తమను గుర్తించి ఇళ్ల పట్టాలు అందిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కోరారు.